# మూలమలుపు

ఏనుగు నరసింహారెడ్డి



కవిత్వం

తెలుగు సాహితీలోకానికి ఏనుగు నరసింహారెడ్డి చిరపరిచితుడు. విభిన్నమైన నేపథ్యం ఆయనది. కల్లోనికుంటలో జన్మించి అనివార్యంగా చిట్యాలకు వలస వచ్చారు. విద్యాగంధం లేని రైతు కుటుంబం నుండి రావడం ఈ ప్రాంతానికి ఆశ్చర్యమేమీ కాదు. ప్రచురించిన పుస్తకాల కంటే పత్రికల్లో రాయడం ద్వారా ఆయన ఎక్కువమంది పాఠకుల్ని చేరుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో పని చేసిన ఈయన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్. ప్రస్తుతం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. 2017 డిసెంబర్ 15 నుండి 19 వరకు హైద్రాబాద్‌లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల నిర్వాహకులలో ఒకరు. ఆ జ్ఞాపకం, ఆ అలసట ఆయన రచనల్లోకి చేరిపోయింది కూడా.

సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, కరీంనగర్, నిజామాబాద్, హైద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాల్లోని పట్టణాల్లో, పల్లెల్లో విలక్షణమైన అనుభవాలు ఆయనవి. సామాన్యుల్ని, అసామాన్యుల్నీ దగ్గర నుండి చూసారు. ప్రజల్ని, పరిపాలననీ, రాజకీయాల్నీ బ్లాక్ అండ్ వైట్‌లో పరిశీలించారు. ఉప్పెనలా ముంచెయ్య బోయిన వ్యక్తుల్ని, కుప్పకూలి పోయిన జీవితపు దైన్యాల్ని చలనశీలమైన కాలవాహినిలో దర్శించారు. తెలియనిది రాయరు. అనుభవించనిది, అనుభూతి చెందనిది రాయరు. అది ఆయన నైజం. ఆ ఆర్ద్రత ఆయన కవిత్వం నిండా కనిపిస్తోంది. సమాంతర స్వప్నం, నేనే, మట్టిపాట, కొత్తపలక, హైద్రాబాద్ విషాదాన్ని అక్కున చేర్చుకున్న సాహిత్య లోకానికి 'మూల మలుపు' మరో కానుక.

# మూల మలుపు

## కవిత్వం

ఏనుగు నరసింహారెడ్డి

పాలపిట్ట–బుక్స్
హైదరాబాద్

Moola Malupu

*An Anthology of poetry*

by **Anugu Narsimha Reddy**

Cell : 89788 69183

Email : narsimhareddy.anugu@gmail.com

© Poet

| | | |
|---|---|---|
| Cover Design | : | J. Kumar |
| First Edition | : | 2018 |
| For Copies | : | Anugu Narasimha Reddy<br>3-14-50,<br>Vijayasri Colony<br>Sahara Road<br>Vanasthalipuram<br>Hyderabad-500 070<br><br>Palapitta Books<br>16-11-20/6/1/1<br>403, Vijayasai Residency<br>Saleem Nagar, Malakpet<br>Hyderabad - 500 036<br>Phone: 040-27678430 |
| Printed at | : | Karshak Art Printers<br>Vidyanagar<br>Hyderabad |
| Price | : | Rs. 100 |

# అంకితం

పైవాళ్ళెవరూ
పని చేయరనే నానుడికి విపర్యయం
ఉపరితలపు కార్యావళికి చాలా దూరం
పనిలో మనసు
మనసులో పని
సమగ్రత ఆయన ధర్మం
అవాచ్యత ఆయన మర్మం
ఐ.ఏ.ఎస్.కు కొత్తవన్నెలు తెచ్చిన
తెలంగాణ మట్టి బిడ్డ
**ఎం.రఘునందన్ రావు గారికి**

డా. నందిని సిధారెడ్డి

చైర్మన్
తెలంగాణ సాహిత్య అకాడమీ

# మనసు తిరిగిన మలుపు

ఏ సృజనకైనా లోకమే ప్రమాణం. జీవితాన్ని ఆవాహన చేసుకోకుండా ఏ కళా ఆవిర్భవించదు. మానవ భావోద్వేగాలతో నిమిత్తం లేకుండా సాహిత్యరూపాలు మనలేదు. లోకంతో మనిషి జీవిత కాలం చేసే నిరంతర భాషణమే కవిత్వం. కాలాలు, జ్ఞాపకాలు, స్వప్నాలు, దు:ఖాలు, అనుభవాలు, అవస్థలు, ఆరాటాలు ఎన్నెన్నో మనిషి ప్రయాణాన్ని మలుపు తిప్పిన మన:ప్రకంపనలు కవిత్వం నిండా జాలువారుతాయి. కనిపించని లోకం కంటే, కనువిందు చేసే ప్రకృతి కంటే సంచలించే జీవితమే కవికి మూల వనరు. జీవితాన్ని మించిన కవిత్వం లేదు. చాలాసార్లు జీవితాన్ని ఆవిష్కరించటానికి కవిత్వం చాలదు. అయినా అన్ని స్థితుల్ని అందుకోవటానికి కవిత్వం తప్ప మరేమీ లేదు.

'అంతరంగంలో జరిగే వేదనని పొల్లు బోకుండా అక్షరీకరించే కలం ఒకటి దొరికితే ఎంత బాగుండేది' (అంతరంగం) అని మథనపడి మథనపడి మనసు పరుస్తున్న కవి ఏనుగు నరసింహారెడ్డి. ఎన్ని కన్నీళ్లు దాటుకొని వచ్చాడో, ఎన్నిసార్లు కలతపడి కవిత్వమల్లుకున్నాడో, కవిత్వం ఆసరాతో జీవితాన్ని గెలుచుకుని 'మూల మలుపు' వెలువరిస్తున్నాడు. లోగడ నేనే, సమాంతర స్వప్నం, కొత్తపలక సంపుటాల అనుభవంతో పొల్లు బోకుండా అంతరంగాన్ని ఆవిష్కరించడానికి తీర్చిన అక్షరయాత్రే మూల మలుపు.

జీవితం విచిత్రమైంది. విస్తారమైంది. జీవితాన్ని ఆస్వాదించటానికి శరీరమే ఆధారం. జీవితాన్ని, చుట్టూ ఆవరించిన లోకాన్ని అర్థం చేసుకొనే లోపల శరీర పరిమితి ముగుస్తుంది. ఏం చేసినా, ఏం రాసినా, ఏం అందుకున్నా గడిగడికి హెచ్చరిస్తుంది గడువు. ఆ సూక్ష్మాన్ని సునిశితంగా కవి గ్రహించాడు.

**ఎవరూ ఈ లోకానికి**

**ఎక్కువ కాలం అక్కర లేదు**

**అందుకే– పొద్దు గూకక ముందే**

**గూట్లో దీపం పెట్టడం మంచిది** (గూట్లోదీపం)

సున్నితంగా జీవనస్థితిని సూచించాడు నరసింహారెడ్డి. ఎవరికయినా జీవితం పరిమిత కాలమే. దాన్ని చిత్రంగా వ్యక్తీకరించాడు. పొద్దుకూ జీవితానికీ పోలిక, పొద్దుకూ మనిషికీ లెంక గమనంలో ఉంచుకొని 'దీపాన్ని' వెలిగించుకుంటాడు. కర్తవ్యం మనిషికి. కాంతి లోకానికి.

**బయట పడని ఎజెండాల నడుమ**

**అన్ని చురకత్తుల్ని తప్పించుకోవాలనుకుంటాను**

**గాయపడకుండా ఉండాలనుకుంటాను**

**చివరికి– గాయపడ్డాకే ఇల్లు చేరుకుంటాను** (గాయపడ్డాక)

అక్షరాల్లో ఇమిడ్చిన వేదనను మనసున్న వారెవరూ దాటిపోరు. కవి ఎంత గాయపడితే ఈ వాక్యాలు రాయగలడు? సామాన్యుడిగా ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, బయటకు వెళ్లేటప్పుడు భద్ర కవచాలు ధరించినా మనిషిగా గాయాల్తోనే ఇంటికి చేరుకుంటాడట. కనుకనే నరసింహారెడ్డి కవి. మనసున్న కవి. మంచి కవి.

మనిషిని మార్కెట్ కబళించిన కాలం ఇది. వస్తువులే సమస్తమైన సన్నివేశమిది. ఆ విపత్ స్థితిని విపరీతాన్ని చిత్రించాడు.

**మార్కెట్ ప్రపంచంలో లోకం**

**వచ్చిన దారి మరిచి పోతూ ఉంటుంది**

**మనుషులంతా 'మాల్స్'లో**

**చిక్కుకు పోతూ ఉంటారు**

**తిరిగిన ప్రదేశంలోనే పదేపదే కాట గలుస్తూ ఉంటాం** (ఒకర్నొకరం తప్పిపోతూ)

తిరిగిన ప్రదేశంలో కాటగలువడం చిత్రమైన స్థితి. తెలుస్తూనే ఉంటుంది తప్పిపోతున్నట్లు. ఎప్పటికప్పుడు దారి దొరికినట్టే అనిపిస్తుంటుంది. స్పృహ ఉండీ చిక్కుపడటం వంటి దయనీయ పరిస్థితిని నరసింహారెడ్డి బలంగా, హత్తుకునేటట్టు వర్ణించాడు. మన అనుభవాన్నే మళ్లా అనుభవంలోకి తేవటం మంచి కవిత్వానికి దాఖలా.

నరసింహారెడ్డి చాలా మందితో సంచరించాడు గనుక – మనస్తత్వాల్ని కూడా పట్టుకున్నాడు. మనిషి ఎట్లాంటివాడో, ఎట్లాంటి వాళ్లను నమ్మొద్దో స్పష్టపర్చాడు కూడా. కవిత్వం అనుభవపూర్వక సందేశం.

**ఏదీ మిగలదని తెలిసీ**

**ఏదో మిగిలించుకుందామని**

**ఒక్కచోట కాలు నిలువకుండా నడయాడే నది మనిషి**

**.....................................**

**మనుషులను నమ్మొద్దని ఎప్పుడో చెప్పినట్టున్నావ్**

**అతి తెలివైన మనుషుల్ని అసలే నమ్మొద్దని**

**నానుడి కావలసి ఉంది** (తొలి పరిచయం)

మనిషికి ఆసరా మనిషి. మనిషి మనిషిని నమ్మకపోతే జరగదు. నమ్ముతాడు. భంగపడతాడు. నమ్మకస్తులెవరో తెలుసుకోవటమే తెలివి. అతి తెలివైన మనుషుల సంగతి కుండబద్దలు కొట్టి చెప్పాడు కవి.

ఊరి నుంచి వచ్చిన కవులకు ఊరే ఉత్సాహం. మంచి కవిత్వానికి ఊరే ఊపిరి. నరసింహారెడ్డి కూడా ఊరి నుంచి వచ్చిన కవే. ఊరొక తీపి జ్ఞాపకం.

**చెరువుల్లోనూ దిగుడుబావుల్లోనూ**

**సమస్త జీవజలానికి జలం**

**అందివచ్చినట్లుండే –**

**నీళ్లకు లేబిళ్లు లేకుండే –**

**ఊరు తల్లి వేరు –**

**అది పైసలతో కాదు – మమతలతో జీవించేది** (అదే ఊరు)

కవి ఊరును తలుచుకున్నాడు. ఒక ఉత్సాహం కలిగింది. అంతలోనే సందేహం ఆవహించింది. ఇప్పుడు ఊరు అట్లానే ఉన్నదా...? లోకమంతా మారుతుంటే తన ఊరో... అని ప్రశ్నించుకుంటూ అనుకుంటాడు – 'నా ఊరైనా ఇప్పుడు నన్ను సాంత్వన పరుస్తుందా?'

ఏనుగు నరసింహారెడ్డికి అక్షరాల కూర్పు తెలుసు. ఏ పదం ఎట్లా పలుకుతుందో పసిగట్టినవాడు. ప్రతీకలయినా, పదచిత్రాలయినా తెలిసి ప్రయోగిస్తాడు. పుస్తకం గూట్లో పదాలు తాల్చి అనుభవం అంటించి కవిత్వం వెలిగించాడు. నరసింహారెడ్డి కవిత్వంలో

అప్పుడప్పుడు మూసిన కనురెప్పల మీద అప్సరసలు నాట్యమాడుతారు (నిద్రనవ్వు). కొన్నిసార్లు విసిగిపోయి దేవతలంతా చెట్ల అవతారం చాలించుకుంటారు (ఇలలోని రూపం). చిదంబర రహస్యాలు విప్పబోయి, చిత్రంగా మళ్ళీ చెట్టెక్కి కూసున్న భేతాళులు తారసపడుతారు. హృదయాన్ని వెలిగించే తైలతుల్యులైన మనసైన మహారాణులు దర్శనమిస్తారు.

'పుస్తకాలు లేని ఇల్లు ఎడారి'గా భావించే ఏనుగు నరసింహారెడ్డికి కవిత్వమే ఊరట. సాంత్వనపర్చే ప్రపంచం సాహిత్యమే. తనకు 'ఏమీ చదవని రోజు ఏమాత్రం ఎదగని రోజు' . 'ఏదీ రాయని రోజు ఎంతో కోల్పోయిన రోజు'. కవిత్వం పట్ల, రచన పట్ల అంత అభిమానం. నరసింహారెడ్డికి కవిత్వం సరదా కాదు. కాలక్షేపం కాదు. కవిత్వమంటే మనసు.

**కవిత్వం ఎప్పుడూ**
**కవిపక్షమే**
**కవే**
**ప్రజలపక్షం.**

**09-05-2018**

**డా॥ అమ్మంగి వేణుగోపాల్**

**కాళోజీ సాహిత్య పురస్కార గ్రహీత**

**కేంద్రసాహిత్య అకాడెమీ తెలుగు సలహా సంఘం పూర్వ సభ్యులు**

# విరి తోటకు దారి

ఒక కవి రాసిన గొప్ప కవితకు వ్యాఖ్యాత రాసే తాత్పర్యం కూడా కవిత్వంలాగే వుంటుంది. కవిత్వం గొప్పదనం ఎప్పుడూ చర్చనీయాంశమే. ఏమిటి? ఎందుకు? అన్న ప్రశ్నల నడుమ ఒక అనిర్వచనీయ అనుభూతి అనుభవైక వేద్యమే. జీవిత సత్యాన్ని ఆవిష్కరించటమే కవిత్వం ప్రధాన లక్షణం అన్న అభిప్రాయం దగ్గర నుంచి జీవిత కార్యాచరణలో వ్యక్తిత్వాన్ని చైతన్యవంతం చేసేదే కవిత్వం అన్న అభిప్రాయం వరకు కవులు ప్రయాణం చేస్తూ వస్తున్నారు. అక్కడ కూడా ఆగకుండా అత్యాధునిక రహదారుల్లో పురోగమిస్తున్న దశలో కూడా అక్షరాల సహచర్యం ఎప్పుడూ అమూల్యమైనదే.

కవి నిరంతరం వస్తువుల వేటలో వుంటాడు. వస్తువుకు ప్రాణం పోసే వ్యాపకంలో వుంటాడు. ప్రాణం పోసిన తర్వాత దాని నడకను గమనిస్తూ వుంటాడు. కవికి కవితకు తండ్రికి బిడ్డకు వున్న అనుబంధం వంటిది వుంటుందనుకుంటాను. అందుకేనేమో చిన్నపాటి వ్యతిరేక విమర్శను కూడా తట్టుకోలేడు. చిన్న ప్రశంసకు కూడా గగనంలో మేఘశకలమై తేలిపోతాడు.

'సమాంతర స్వప్నం', 'నేనే', 'మట్టిపాట', 'కొత్త పలక' వంటి కవితా సంపుటాలతో, 'హైద్రాబాద్ విషాదం' వంటి అనువాదాలతో, వారం వారం రుబాయిలతో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి లబ్ధ ప్రతిష్ఠులు. 'తెలంగాణ సాహిత్య అకాడమీ' కార్యదర్శిగా సవాళ్ళతో కూడిన బాధ్యతల నిర్వహణ మూలంగా సాహిత్య ప్రపంచంలో విఖ్యాతులు.

వారు 'మూల మలుపు' అన్న కవితా సంపుటిని ప్రచురిస్తున్నందుకు అభినందిస్తూ, దాని పరామర్శను 'నిద్ర నవ్వు'తో మొదలు పెడదాం. చిన్న పిల్లల శైశవప్రపంచం ఒక

మిస్టీరియస్ యూనివర్స్ అనుకుంటే అమాయకపు పాలనవ్వు, ఆ ప్రపంచం లోకి రారమ్మంటూ పలికే చిలిపి ఆహ్వానం. అది నిద్ర నవ్వయితే మనలోనే ఒక ప్రపంచాన్ని సృష్టించే అలౌకిక శక్తి.

**'మూసిన కనురెప్పలమీద**
**అప్సరసలు నాట్యమాడుతారు**
**వాడి నిద్రనవ్వులో**
**ఎక్కడలేని సోయగం'**

అంటున్నారు కవి. 'అప్సరసల నాట్యం' కూడా సరిపోక 'ఎక్కడలేని సోయగం'తో సరిపెట్టుకొని కవిత్వం కన్నా పసిపాప నవ్వు ఎంత ఉన్నతస్థాయిలో వుందో మన ఊహకే వదిలి పెడుతున్నారు నరసింహారెడ్డి.

'అంతరంగం' కవిత ఒక ఫిర్యాదు. మామూలుగా ప్రణయ కవిత్వంలో ఫిర్యాదు వుంటుంది. అయితే ఇక్కడ నరసింహారెడ్డి ఫిర్యాదు ప్రత్యేకమైంది. సమాజంలో మన చుట్టూ వున్న బాధలు, వేదనలకు అంతులేదు. కాని, ఎందుకో వీటి ఉపరితలాన్ని మాత్రమే, అదీ ఒక మూసగా కవులు ప్రకటిస్తున్నారే తప్ప లోలోతుల్లోకి వెళ్ళలేక పోతున్నారు. 'కాసింత కాఠిన్యాన్ని' మాత్రమే కాదు 'అనుకరణ ఉద్యమాలను' కూడా కవిత్వీకరించే కవులు, 'అలవిగాని ఆవేదనలను' అందుకోకుండానే 'అదృశ్యమయి పోవటం' కవి నరసింహారెడ్డిని ఆశ్చర్య చకితుణ్ణి చేస్తున్నది. దీన్నే

**'శిలాసదృశ చిక్కు ముళ్ళను గోరంతైనా**
**చిత్రిక పట్టలేని కలాలకు**
**కొత్త దృక్కులుంటే**
**ఎంత బాగుండేది'**

అని ఆశపడుతున్నారు 'శిలాసదృశ చిక్కు ముళ్ళు', 'యంత్ర మాతృక' వంటి కొత్త భావనలను కవితా ప్రపంచంలోకి తెచ్చి, మానవీయ స్పర్శను, సౌకుమార్యాన్ని కోల్పోయిన దుస్థితిని ఖండించటం అపురూపంగా వుంది.

మరి కవి సౌకుమార్యం ఎట్లాంటిది?

**"లోక సంద్రంలో**
**మునకేసి తడిసి**
**తుడుచుకోరాని నెమలి పిల్లలా**

**నిలబడుతుంది**
**లోకాన్ని**
**తన అద్దంలో చూపించి**
**కమ్మల మీద**
**బొమ్మ చేసి**
**కాలానికి ఆరబెడుతుంది'** (పక్షపాతి)

కవిని నెమలిపిల్లను చేయటం, అది లోక సముద్రంలో తడిసి, ఆ తడిని తుడుచుకోలేని నిస్సహాయ ఆనంద పారవశ్యంలో నిలబడిపోవటం రెండూ సుకుమార భావనలే. మొదటిది అలంకారికం (ఉపమ) కాగా, రెండోది సన్నివేశ గతమైన భంగిమ. అంతటితో కవి ఆగలేదు, లోకాన్ని నెమలీక అద్దంలో ప్రతిబింబింప జేస్తున్నాడు. కవిత్వాన్ని కమ్మల మీద బొమ్మ కట్టించి, ఆ బొమ్మను కాలం గాలికి ఆరబెడుతున్నాడు. ఇక్కడ కవి ప్రదర్శించిన 'చిత్రీకరణ' విన్యాసమంతా సాహిత్య ప్రయోజనానికి సంబంధించిందే.

అర్థం కాని రాత గొలుసురాత. గొలుసు - సంకెల అన్న భావాన్ని కూడా చెప్తున్నప్పుడు అక్కడి లోతును అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తాం. కవిత్వ సాధకుడికి వుండే అనుభవాలు చిత్ర విచిత్రం. జాగ్రదవస్థలో కవి రాసుకున్న కవిత్వ పంక్తుల కన్నా స్వప్నావస్థలో పలవరించిన పంక్తులే కవితో నడచివస్తాయట! ఇది యథార్థ వైచిత్రి! ఈ వైచిత్రితోనే ముందుకు సాగితే- కనిపించే వ్యక్తుల అర్థం కాని అంతరంగాలు, ఎంత తరచినా అర్థం కాని మన జీవితాలు సవాళ్ళయి నిలుస్తాయి. అయినా కవి-

**'ముందుకు సాగుతున్న కొద్దీ**
**మన ప్రమేయం తగ్గిపోవటం గురించి**
**కాస్తూనే వుంటాం'**

అంటూ కాలం ముందు తన నిస్సహాయ గమనాన్ని గురించి, రాయకుండా వుండలేని యాంత్రికతను గురించి వ్యాఖ్యానిస్తున్నాడు. ఈ ముగింపు పాదాలు కవి అనుభవ గాఢతకు నిదర్శనం.

'తల్లి వాస్తవం, తండ్రి భావన' అంటారు. ప్రేమ స్వరూపిణి తల్లి ద్వారా ప్రేమించటం నేర్చుకునే సంతానం, జ్ఞాన స్వరూపుడైన తండ్రి ద్వారా జీవించటం నేర్చుకుంటుంది. కవులకు తల్లి ఒక సెంటిమెంట్. అందుకే తల్లి మీద వచ్చినంత కవిత్వం తండ్రి మీద

రాలేదు. ఆ లోటు కొద్దిగానైనా తీర్చే కవిత నరసింహారెడ్డి 'నాన్న', మండుటెండ నుండి కాపాడే 'చెట్టు'గా, జడివాన నుండి కాపాడే 'గొడుగు'గా నరసింహారెడ్డి నాన్నను భావించటంలో ఆశ్చర్యం లేదు.

**'సమస్త విశ్వమూ**
**శత్రు శిబిరమై తలపడ్డప్పుడు**
**నాన్న ఒక్కడే తోడై**
**ముందుకు నడిపిస్తాడు'**

అన్న పంక్తుల్లో కత్తిగా, ఢాలుగా, కవచంగానే కాదు, కవాతుగా కూడా నాన్న దర్శనమిస్తున్నాడు.

మనిషిని బోనులో నిలబెట్టి పంచభూతాలు, జంతుజాలం విచారణ జరిపితే అది 'సరిహద్దుల్ని ధిక్కరిస్తూ' అన్న కవిత అవుతుంది. శీతవాయువుకు, వెలుగురేఖకు, జడివానకు సరిహద్దులు లేవు. గోవుకు, పిచ్చుకకు, నెమలికి, కాకికి తమ తమ జాతుల్లో తరతమ భేదాలు లేవు. సహజాత వివేచనతో బతికే వీటికి లేని ఉచ్చనీచాలు, భయసందేహాలు జ్ఞాన తేజోపుంజాల మనుకునే మనుషుల మధ్య ఎందుకున్నాయన్నది ఏనుగు నరసింహారెడ్డి ప్రశ్న.

**'మనం లేపిన**
**గోడల నీడలు**
**ఎంత కురుచవి!'**

అన్న ముగింపులోని కురుచదనం నీడలకే కాదు, మనుషులకూ వర్తిస్తుంది. కృత్రిమ విలువలతో మనల్ని మదింపు వేసుకున్నంత కాలం జవాబు తప్పుగానే వస్తుంది.

మన ఊరు, మన బాల్యం. ఆ అప్పటి జ్ఞాపకాలు ఎప్పుడైనా బంగారుగనులే. వీటిని నోస్టాల్జియా స్మృతుల కన్నా ఉన్నతంగా ఎట్లా రాయవచ్చునో నరసింహారెడ్డి 'అదే ఊరు' కవితలో నిరూపించారు.

**'గట్టుకు కిరీటం బెట్టిన**
**సింగిడి'**
**'వున్న ఊరు తల్లి వేరు'**
**'అది పైసలతో కాదు**
**మమతలతో జీవించేది'**

వూళ్ళో ఒకప్పుడున్న కవికి ఆ జ్ఞాపకం కిరీటం తొడగడంలో ఆశ్చర్యం లేదు. అయితే–

**'జీవితం**
**కవిత్వాన్ని వెంటాడుతున్నట్లు**
**తెలుసుకానీ**
**దీనికిన్ని ఫిట్టింగులు**
**బిగించాల్సి వస్తుందని'** తెలియదు

ఈ కవికి జీవితం కవిత్వాన్ని వెంటాడుతున్నట్టుంది. మరో కవికి కవిత్వం జీవితాన్ని వెంటాడుతున్నట్టుండవచ్చు. వీటితో అనివార్యంగా చోదకశక్తి అయిన జీవితం నుంచి ప్రేరణ పొందుతూ కవిత్వం రాయటంలో ఒక అన్వేషణ వుంది. చేరీచేరని గమ్యం, దొరికీ దొరకని ఫలితం, గెలిచీ గెలవని తత్వం ఉండటం వల్ల –

**'నా ఊరైనా ఇప్పుడు**
**నన్ను సాంత్వన పరుస్తుందా'**

అన్న ప్రశ్న కాని ప్రశ్న వెంటాడుతుండటమే కవి అయిన మనస్విని నిరంతర అన్వేషణలో ఉంచుతుంది.

ఇట్లా ఏనుగు నరసింహారెడ్డి కవిత్వం గూర్చి ఎంతైనా చెప్పుకుంటూ పోవచ్చు. కవే అన్నట్టు–

**'ప్రపంచంలో**
**కవిత్వమొక ప్రపంచం**
**మునిగిన కొద్దీ మణిదీపాల వెలుగులో**
**నివ్వెరపోయే సముద్రం లాంటి**
**ప్రపంచం'** (కవిత్వమొక ప్రపంచం)

గమనించారు కదా, పై పాదాలలో కవిత్వాన్ని పోల్చటానికి రెండు మాటలను కవి ఉపయోగించాడు. ఒకటి – ప్రపంచం. రెండు – సముద్రం రెండు విస్తృతమైనవే. గంభీరమైనవే. ఇంకా ఆలోచనామృతం లాంటి కొత్త భావాన్ని కూడా ప్రతిపాదిస్తున్నాడు.

**'భాషతో మొదలవుతుంది కాని**
**అదెప్పుడూ అక్కడ**

**ఆగిపోయిన దాఖలాల్లేవు'**

అవును నిజమే! కవిత్వం ఏదో ఒక భాషలో మొదలవుతుంది. భాషాతీత భావనగా స్థిరపడిపోతుంది. ఏ కవిత్వానికైనా ఈ లక్షణాలు వర్తిస్తాయి.

ఈ సంపుటికి తెలంగాణ కవిత్వం అదనపు చేర్పు. తెలంగాణ సిద్ధించిన సంవత్సరన్నరకు ఏనుగు నరసింహారెడ్డి–

**'కలుపు ఒక ఊసరవెల్లి**
**ఒడుపుగా పంటరంగులో**
**ఒదిగి పోతుంది'**

అంటూ జాగ్రత్తలు చెప్తున్నారు.

**'ఇది మూల మలుపు**
**రాష్ట్రమే బేకారని**
**కనిపించని ట్యాగ్‌లైన్ జోడిస్తాడు**
**పారాహుషార్!'** (పారాహుషార్)

రాజకీయ కుట్రలు ఎప్పుడూ రాజుకుంటూనే వుంటాయి. 'అశాస్త్రీయ విభజన' అన్న వాదం వెనుక కూడా కుట్రలే దాగున్నాయి. అయినా –

**'ఇప్పుడు జూన్ రెండు అంటే**
**కాలం యవనిక మీద**
**సప్తవర్ణాల అద్దకం దిద్దినట్లున్నది'** (జూన్ రెండు)

అంటూ చరిత్రలో నమోదయిన కొత్త రాష్ట్రం కాలంతో చేయి చేయి కలిపి 'పురోగామి ద్వారం తెరుచుకొని' సాగుతున్నదని కవి వర్ణిస్తున్నాడు.

ఎక్కడో ఒకచోట ఆగక తప్పదు కనుక ఈ 'ముందుమాట' ఇక్కడ ఆగిపోతుంది. ఎక్కడ ఆగినా ఇంకా ఏదో చెప్పవలసింది మిగిలిపోయినట్టు అనిపించే కవిత్వం మంచి కవిత్వం. మంచి కవిత్వానికి మారుపేరే ఏనుగు నరసింహారెడ్డి కవిత్వం.

# మూల మలుపు దగ్గర ఒడుపు చెప్పిన

హైకవే మిత్రులకు
ప్రమోద సాహితి మిత్రులకు
విమల సాహితీ మిత్రులకు
తెరసం మిత్రులకు
తెసాస మిత్రులకు
రెవెన్యూ మిత్రులకు

సమాంతర స్వప్నం నుండి కొత్తపలక, హైద్రాబాద్ విషాదం దాకా నా రాతలకు రాతపూర్వకంగా స్పందించిన మిత్రులు, పెద్దలు డా. నందిని సిధారెడ్డి, డా. అమ్మంగి వేణుగోపాల్, డా.ఎన్.గోపి, డా.సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా. గురిజాల రామశేషయ్య, కె.పి.అశోక్‌కుమార్, గుడిపాటి, ఎలనాగ, వై.హెచ్.కె.మోహన్‌రావు, ఎం.నారాయణశర్మ, దాస్యం సేనాధిపతి, ద్వానాశాస్త్రి, తంగిరాల చక్రవర్తి, డా. కొండపల్లి నీహారిణి, కాళ్ళపిళ్ళ సన్యాసిరావు, యెల్లోజు బ్రహ్మాచారి, విష్ణుభోట్ల రామకృష్ణ, మహ్మద్ ఖదీర్‌బాబు, ప్రభాస, దోర్బల, డా. గన్ను కృష్ణమూర్తి, డా. పైళ్ళ సుదర్శన్ రెడ్డి, చొప్పదండి సుధాకర్, చెమికల, కోవెల సంతోష్ కుమార్, అడివి సూర్యకుమారి, ఆర్వీఆర్, ఎస్.కృష్ణమూర్తి, కాసుల ప్రతాపరెడ్డి, డా. కాంచనపల్లి, వనపర్తి కృష్ణయ్య, ఎం.అశోక్‌కుమార్, ఎ.రజాహుస్సేన్, జి.రా., డా. అయాచితం నటేశ్వరశర్మ, కిరణ్‌బాబు, చారి, డా. బెల్లంకొండ సంపత్‌కుమార్, దత్తు, డా. రూప్ కుమార్ డబ్బీకార్, సాగర్ల సత్తయ్య, అశోక్, నర్రా ప్రవీణ్‌రెడ్డి, డా. కాసుల లింగారెడ్డి, డా. చెమన్‌సింగ్ గారలకు

నేను లేని చోటా నా ఉనికిని నిలబెట్టే ఆత్మీయులు వంగ రవీందర్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, డా.కె.వి.రమణాచారి, బుర్రా వెంకటేశం ఐ.ఏ.ఎస్., డా. కూరెళ్ళ విఠలాచార్య, బొంగునూరి బాల్‌రెడ్డి, డా. ఎస్.వి.సత్యనారాయణ, కొల్లాపురం విమల, కె.మదన్ మోహన్‌రావు, టి.పి.రెడ్డి, చైతన్య సింధు, కోమటిరెడ్డి రవీందర్‌రెడ్డి, వై.వసంత, పాటి మోహన్‌రెడ్డి, గ్లోరియా బుజ్జాయి, డా. బాణాల భుజంగరెడ్డి, పొన్నం రాజయ్య, జాల వెంకన్న, మండల స్వామి, ఆశారాజు, నాళేశ్వరం శంకరం, వేముగంటి మురళీకృష్ణ, డి.శాంతకుమారి, అంజనీ బాయి, సర్దార్ బహదూర్ సింగ్, పొద్దుటూరి మాధవీలత, డా. గంటా జలంధర్ రెడ్డి, గణపురం దేవేందర్, కవి యాకూబ్, కె.విల్సన్‌రావు, కాసుల ఆంజనేయులు, రింగు రామ్మూర్తి, శ్రీనివాస గౌడ్, కంశ్రీ, థింసా, పరమాత్మ, రాయరావు సూర్యప్రకాష్‌రావు గారలకు నమస్సులు.

**– ఏనుగు నరసింహారెడ్డి**

# కవితల మలుపు


| | | |
|---|---|---|
| 1 | అవతలి తీరం.. | 21 |
| 2 | ఒకర్నొకరం తప్పిపోతూ... | 23 |
| 3 | చివరి భోజనం | 26 |
| 4 | నిద్ర నవ్వు ... | 30 |
| 5 | అంతరంగం | 32 |
| 6 | కేజ్రీపూల పరిమళం | 34 |
| 7 | పక్షపాతి | 36 |
| 8 | గొలుసు రాత | 38 |
| 9 | జలదృశ్యం... | 40 |
| 10 | నటన దాని నైజం | 42 |
| 11 | మెమెంటో | 44 |
| 12 | చెక్కడం | 46 |
| 13 | నాన్న | 48 |
| 14 | కవిత్వమొక ప్రపంచం | 50 |
| 15 | వాయుముద్ర . | 51 |
| 16 | పాలపిట్టలా ఒకరుంటారు | 52 |
| 17 | గూట్లో దీపం | 54 |
| 18 | భయం | 56 |
| 19 | ఉన్నతి .., | 58 |
| 20 | క్రీడ | 60 |
| 21 | ముప్పయొక్క దీపాలు | 62 |
| 22 | పాలపిట్ట | 65 |
| 23 | మేలు ... | 68 |
| 24 | రోజు | 69 |
| 25 | కాకతి మాతకు జేజే | 70 |

26 సరిహద్దుల్ని ధిక్కరిస్తూ ........ 72
27 ఆమె ........ 74
28 జీవజలం ........ 76
29 అమీబా ........ 78
30 ఆట ! . ........ 79
31 గాయపడ్డాకే... ........ 81
32 ఓడిపోవడం ........ 83
33 హార్డ్ టు డీలిట్ ........ 85
34 జూన్ 2 .. . ........ 88
35 హృదయానందం .... ........ 91
36 తహసిలాఫీసు వైపు ... ........ 93
37 దండుబాట .... ........ 96
38 పిఎస్‌టియు విరి ........ 98
39 ఫ్యూచరంతా రాసి పెట్టే ఉంది ........ 99
40 రద్దు కాయిదం ... ... ........ 101
41 లోహ విహంగం ........ 104
42 ఇలలోని రూపం ... ........ 106
43 అదే ఊరు ........ 108
44 ఏదో ఒక ఉగాదిన ........ 111
45 అతడు, బోరు, పాప ........ 114
46 తొలిపరిచయం ........ 116
47 పగలే చీకటి ........ 118
48 కలల పథం ........ 119
49 అయ్యో! కవీ ... ........ 122
50 మలుపుల దగ్గరి దు:ఖం ........ 123
51 తోటలోకి అడుగెయ్యాలె ........ 125
52 తెలుగు పూలు ........ 128
53 ఆట గుర్రం ........ 129
54 1/2 చాయ్ .... ........ 130
55 ఒక నిజం తెలిసింది. ........ 132
56 తెల్లారగట్ల కల ........ 134

| | | |
|---|---|---|
| 57 | డ్రెస్ రిహార్సల్... | 136 |
| 58 | పోగొట్టుకొన్న చోటు | 138 |
| 59 | మూల మలుపు | 140 |
| 60 | పులి సంచారం | 143 |
| 61 | పారా హుషార్... ... | 146 |
| 62 | చిగురుటాకు... ... | 149 |

# అవతలి తీరం

నడిచొచ్చిన నేలలో
తిరగాడుతున్నాను
పాట జారిపోయిన వేదిక మీద
స్వరాల్ని ఏరుకుంటున్నాను
రెప్ప దాటిన కలల మీద
మెరుపుల్ని చిత్రిక పడుతున్నాను
అప్పుడు ఆగిపోయిన గుసగుసల్ని
ఇప్పుడు పదాల మాల కడుతున్నాను
ఇక్కడ నిలబడి
అక్కడ చూడడం
ఓడిపోవడం కానే కాదు

ఒక దరిని వదిలేసినప్పుడు
నావను నమ్ముకోక తప్పదు
నాకు కాదు
చూసేవాళ్ళకు
ఈ ప్రయాణమొక పరవశం
వుట్టిని నమ్ముకోవల్సిందే
ముంచే నీళ్ళను
ఒడుపుగా ఆసరా చేసుకోవల్సిందే

విశ్వాసాలకు పరీక్షలెదురైన క్షణాలే
మనల్ని నిటారుగా నిలబెడుతుంటాయి
పలుగురాళ్ళు పరుచుకున్న బాటమీద
మెరుపు రాయిలా
మండుటెండల మధ్య మెరుస్తుంటాను
తీరం చేరువయేదాకా
కన్నీటిని ఆపుకొని నడుస్తుంటాను
నన్ను చూసేవాళ్ళు పరవశిస్తున్నందుకు
నేను పులకరిస్తాను
భ్రమల లోకం కరిగిపోయి
వాస్తవాల మట్టిపొరలు పొడసూపుతున్నాయి
ప్రయాణంలో చాలా దూరమే వచ్చాను
ఆ దరికి దూరం తరిగిపోతుంది
ఆహ్లాదకరమైన నది ఆవలి తీరం
నా కోసమే వేగంగా ఎదురొస్తున్నది

*(ఆంధ్రభూమి డైలీ, 16-3-2015)*

# ఒకర్నొకరం తప్పిపోతూ

అన్నీ తెలిసినట్లే ఉంటాయ్
ఒకరికి తెలిసింది
ఒకరికి తెలియకుండా.
నూతనత్వం వికృతత్వం
నునుపుదనం సంరంభం
ఎంతకీ అంతుపట్టకుండా
రహదార్లన్నీ కుబుసం విడుస్తూ
రాత్రులన్నీ నగ్నంగా మెరుస్తూ
కూడళ్ళన్నీ పూనకం పట్టిన
వాహనాలను సింగారించుకొని
ఏమార్చిన పిల్లబాటల్ని
నెమరేసుకుంటూ

మార్కెట్ ప్రపంచంలో లోకం
వచ్చిన దారి మర్చిపోతూ ఉంటుంది
మనుషులంతా మాల్స్‌లో
చిక్కుకుపోతూ ఉంటారు
అప్పుడప్పుడు
ప్రాచీలోకంలోకి తొంగి చూసి
వ్యత్యాసాల వేదనని తట్టుకోలేక
వర్తమానంలోకి దూకేస్తుంటారు

ఉక్కుకవచాల్ని ధరించామని భ్రమిస్తూ
మాయా వాయువుల్ని
మజా చేస్తుంటారు

మనం ఉన్నచోటే ఉండి
ఒకర్నొకరం తప్పిపోతూ ఉంటాం

ఇక్కడ మనుషులు తప్ప
సమస్త వస్తువులు
స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయ్
వస్తు సందోహపు అలజడులు
ఎప్పుడో మొదలై
స్థిరీకరించబడ్డాయ్
ఎవరూ ఎవరికీ కన్పించేటట్లు లేరు

నీ కొండ గుర్తులేవీ నాకు అర్థం కావు
చౌరస్తాలన్నీ ఒక్కతీరే
సింగారించుకొని ఉంటే
నువ్వు మాత్రం
ఫలానా బ్యాంకంటావు
అన్ని చోట్లూ ఆక్రమించిన
ఒకానొక ఏటిఎం అంటావు
కమర్షియల్ నృత్యమాడుతున్న
కాలేజీ సైన్ బోర్డు మీద
మెరుస్తున్న ఆడ్ అంటావు
నువ్వేవేవో చెబుతూ ఉన్నా
ఈ నగరమంతా
ఒక్క తీరుగనే కనిపిస్తుంది.
ఆనవాళ్ళ ఆత్మ ఎక్కడా కనిపించదు
కదిలించే ప్రేమ వాక్యం

ఎక్కడా పలకరించదు
కనుమరుగైన ఊరి గురుతులు
ఎంతకీ అంతుబట్టవు
అంతా సిమెంటు కీకారణ్యం
డబ్బు జెండాలెత్తిన
నిలువు బంగళాలు.
ఎన్ని సంకేతాలు చెప్పినా
ఇప్పుడు పోల్చుకోవడం
తరం కాదు

మనం అక్కడే తిరగాడుతూ ఉంటాం
తిరిగిన ప్రదేశంలోనే
పదే పదే కాటగలుస్తుంటాం

*(సోపతి, నవతెలంగాణ దినపత్రిక, 3-4-2016)*
*(పట్టికోట ఆళ్వారుస్వామి స్మారక రచనల పోటీలో మొదటి బహుమతి పొందిన కవిత)*

# చివరి భోజనం

నరాల దిరిసెన తీగల్ని
నిర్దాక్షిణ్యంగా చిట్లించడం కోసం
నాణ్యమైన తాడు పేనడం వింత
రక్త దాహపు రాచక్రీడను
తెల్లని బట్టల్ని నిండారా తొడిగించి
రక్తి కట్టించడం నటన
కసాయిలా కుత్తుకను ఉత్తరించే ముందు
కమ్మని చివరి భోజనపు కన్నీళ్ళు పెట్టించడం
అమానుష పరిహారం

ఉరి
నేరం కన్నా
వికృత ఘోరం

దోషం జరిగే ఉండొచ్చు
తెలిసి పట్టినా
తెలియక ముట్టినా
నిప్పు కాలుతూనే ఉంటుందన్న
వివేచనకు అవకాశం లేని
విచిత్రమైన లోకంలో
దైన్యంగా చౌర్యం చేసిన

బాల్యముంటుంది
యవ్వనం చిక్కుముడి
విప్పడం అర్థం కాక
ఉద్రేకంగా బిగించిన
కౌమార్యముంటుంది
ఆవేశం ఛానలైజ్ చేసుకోలేక
దారి తప్పిన ఉద్రేకాన్ని
ఉపయోగించుకునే
స్వదేశీ, విదేశీ మతలబు ఉంటుంది
అంతర్లీనంగా
అంతర్జాతీయ రిమోట్ ఉంటుంది
మూలం
దృశ్యం కంటే భిన్నంగా ఉంటుంది

కాలం వీచే గాలిలో
అప్పుడప్పుడు అంతుచిక్కని
విషవాయువులు దొర్లుతాయని
విద్వేషాలు రగుల్తాయని
జీవన్మరణ సంధిలోగాని
తెలియకుండా ఉంటుంది
ధ్వంసానికి మూలాలు
ఛేదించలేని దర్పాలు
శిక్షల మేలిపొరలను
సమర్థతగా కప్పుకుంటాయి

నేరం వెనుక ఆకలి
ఘోరం వెనుక కుట్ర
ఛేదించడం సులభం కాకపోవచ్చు
మన్నించరాని నేరాన్ని మన్నించి
ఆజన్మ బందీ చేయవచ్చు

లోకం నుంచి ఐసోలేట్ చేసి
క్షణం క్షణం ఆత్మావలోకనం కలిగించవచ్చు
ఏ గీతనూ పఠించకుండా
పండంటి జీవితాన్ని
పరిణతి దిశగా పయనింపజేయవచ్చు

జీవన వేదనలన్నీ
గుక్కపట్టిన సంవేదన మరణం
ప్రకటన నుండే మొదలయ్యే నరకం
అత్యున్నత శిక్ష

జారిపోయిన బండి ఇరుసులా
చెదిరిపోయిన జ్ఞాపక శకలాలన్నీ
తలుచుకునే సమయం ఉండదు
తన్నుకొని దుఖించడానికి
పరుచుకున్న తల్లి ఒడి ఉండదు
చెంపల మీద కాల్వల నీరు
తుడిచే ప్రియురాలి స్పర్శ ఉండదు
ఆడిన నేస్తం
పాడిన పరవశపు జ్ఞాపకమూ
చిన్ననాటి చందమామ
కలెమెలిగిన బుజ్జిమేక
ఊయలలూపిన కుక్కిమంచం దరికి రావు
దు:ఖం
ఒంటరి దు:ఖం
పంచుకోలేని నిర్వచించుకోలేని దు:ఖం
నలువైపులా ఆవరించుకున్న
నల్లని రాతిగోడలకూ అలవికాని దు:ఖం
preplanned cruel murder
Resulted in capital punishment

కార్యం వెనుకనున్న కారణం
ఎవరికీ పట్టదు
క్షమాభిక్ష తిరస్కారం
ప్రాసిక్యూషన్ అభీష్టమే
ఏదైనా అమాయకత్వం కలగలిసిందా అన్న
వివేచన తెలియని తలారి
దు:ఖంతోనే పని పూర్తి చేస్తాడు
రాజ్యం దర్పంగా ముందుకు నడుస్తుంది

దైవం మాత్రమే
విధించవలసిన శిక్ష అది
రాజుల చౌరబాటును
ధిక్కరించవలసిందే
మరణ శిక్ష
మధ్య యుగాల
రాక్షస దాహం
పగతో ఊగే
రాజ్యం దించే
ప్రకటిత గునపం
దాన్ని ఎదిరించవలసిందే

*(నవతెలంగాణ దినపత్రిక, 16-5- 2016)*

# నిద్ర నవ్వు

పెదవులను సాగదీసి
ఇంటినిండా వెలుగుల్ని పుక్కిలిస్తాడు
అమ్మ భుజం మీద తలవాల్చి
తక్కిన ప్రపంచంతో సవాలు చేస్తాడు
నవ్వుతాడు
నవ్వుతున్నానని
ఎలా చెప్పాలో తెలియక నవ్వుతాడు
పడుతూ
లేస్తూ
పడినందుకూ
లేచినందుకూ నవ్వుతాడు
రెప్పల తలుపుల్ని
మూస్తూ తెరుస్తూ ముచ్చటగా నవ్వుతాడు

వాడు మేలుకుంటే వెలుగు
వాడు నిద్రిస్తే వెన్నెల
వాడి నవ్వు వెలుగులే లేకపోతే
ఇంటిలోకమంతా చీకటి

***

ఊహల పిట్టలకు రెక్కలొచ్చి
పరుగుతోకాలువ ఉపరితలాన్ని
కదిలించి మురిసినట్లు

కాళ్ళు టపటపా కొడుతూ
వాడు నిద్రనదిలోకి జారి
మనల్ని జాగరూకపు గట్టు మీద
కూర్చోబెడతాడు
అభ్యాసం లేని యోగం అతడి నిద్ర
తటాల్న రెప్ప వేయడమూ
చిత్రంగా కన్ను తెరవడమూ
పుట్టగానే నేర్చిన ఏకలవ్యుడు

మూసిన కనురెప్పల మీద
అప్సరసలు నాట్యమాడుతారు
వాడి నిద్రనవ్వులో
ఎక్కడలేని సోయగం

నవ్వును తమాయించుకొని
అంతరంగ లోకానికి
కలవరపడి కదులుతాడా!
బయటి ప్రపంచమంతా ఉలిక్కి పడుతుంది

కాలం గీసిన తొలిగీత మీద
పరుగు పందానికి అడుగు సిద్ధం చేస్తున్నాడు
ఎవరో ఆత్రంగా విజిల్ వేసినట్లు
నిద్రలోనే పరుగుకు సిద్ధమవుతున్నాడు

ష్... సడి చేయకండి
కలల మూటల్ని నిద్రనదిలో
జారవిడిచే ప్రమాదముంది

*(ఆంధ్రజ్యోతి డైలీ, వివిధ, 23-3-2015)*

# అంతరంగం

అంతరంగంలో జరిగే వేదనను
పొల్లుబోకుండా అక్షరీకరించే
కలం ఒకటి దొరికితే ఎంత బాగుండేది
కాసింత కాఠిన్యాన్నే
కళాత్మకంగా విపులీకరించే
కవులున్న కాలంలో
అనుకరణ ఉద్యమాలనే
అక్కున జేర్చుకునే
సృజనకారులున్న సందర్భంలో
అలవికాని ఆవేదనలు అందకుండానే
అదృశ్యమయిపోవడం
అతి పెద్ద పరిమితత్వమై
అపహాస్యం చేస్తుంది
చిన్నవి మిన్న చేయడం చూసాం
శిలాసదృశ చిక్కుముళ్ళను గోరంతైనా
చిత్రిక పట్టలేని కలాలకు
కొత్త దృక్కులుంటే
ఎంత బాగుండేది

కొలమానాల మస్కిష్కమైనా
ఒకటుంటే ఎంత అపురూపంగా ఉండేది
ఏ బాధాతప్త హృదయుడైనా
తన వేదనను కొలత వేసే
యంత్ర మాతృకను సిద్ధం
చేయగలిగితే ఇంకెంత బాగుండేది

*(ఆంధ్రప్రభ డైలీ, 13-5-2013)*

# కేజ్రీపూల పరిమళం

రంగు వెలిసి చారగిలబడిన
పిట్టగోడల సందుల్లోంచి
అతను నడుస్తున్నాడు
అద్దంలో మెరిసిపోతున్న
రాజభవనాల ముందు
రంగుల ముస్తాబుల్లో మునిగిన
నల్లని తారు దారి దాటి
మట్టిరోడ్డెక్కి మరీ నడుస్తున్నాడు

కుడి ఎడమల కరెంటు తీగల మీద
చిరిగి కొట్టుకుంటున్న గాలిపటాలు
వాడి పారేసిన దూది ముద్దల్లా
రెపరెపలాడతున్న ప్లాస్టిక్ కవర్ల నడుమ
ఏదో దొరుకుతుందని
ఏదీ అందుకోలేని గొర్రె పిల్లలు
పాడుగొట్టుకుంటున్న
ఆకుపచ్చని దర్వాజల ముందు కూడా
అతను

నడక ముఖ్యం కాని
చింత కాదంటాడు
సామాన్యుల వాకిళ్ళలో
అసామాన్యుల లోగిళ్ళలో
సమాన వేగంతో నడిచేవాడు
సామాన్యుల అవసరాల కోసం
వాళ్ళ అవకాశాల కోసం

మిన్ను విరిగి మీద బడ్డట్లు
రాజధాని రాజకీయం నోరెళ్ళబెట్టింది
కాషాయం కూడా ఖంగుతిన్నది

ఇప్పుడతను - నిజాయితీ నిప్పు మీద
వెలిగి అలా నడుస్తున్నాడు
ఏదో ఆశ మళ్ళీ
తిరగాడుతున్న అలజడి అతని చుట్టూ
సామాన్యుల రాజ్యపు
ఆకాశ కిరణం కిందికి వస్తుంది
కులాన్నో, మతాన్నో, వాదాన్నో, వివాదాన్నో
అడ్డుపెట్టకండి
ఎందుకంటే ఎక్కడ మొదలు పెట్టాలో
తెలియని ఒక యుద్ధం మొదలయింది
దేశమంతటా విస్తరణ కోసం కాపు కాద్దాం

*(ఆంధ్రభూమి డైలీ, 27 జనవరి 2014)*

# పక్షపాతి

కవిత్వం చెప్పడం కష్టం
కవిత్వం మీద
కవిత్వం చెప్పడం
కవిత్వం చెప్పడం కన్నా కష్టం

పద్యం కవిత్వమా
గేయం రసత్వమా
వచనం నవత్వమా
అంటూ గుణిస్తే
నవత్వ ఆలోచన
జడత్వ విమోచన
కవిత్వం
టుది పవర్ ఆఫ్ కవిత్వం

కవిత్వం
అక్కడి మట్టిని పూసుకొని
మైల పడుతుంది
మనుషుల్ని రాసుకొని

క్రీగంటి చూపులు చూసుకొని
సృష్టిలో చేయాల్సిన తప్పేదో
నిస్సిగ్గుగా చేసుకొని
మనిషి లక్షణాల్లోని
మెరుపుల్ని అద్దుకొని
ముందు తరాల ముందుకు
ఊరేగుతుంది

చెట్లకూ గుట్టలకూ
మనిషిని పట్టిస్తుంది
పచ్చని బయళ్ళ మీద పడకేసి
సృష్టి రహస్యాల్ని శోధిస్తూ
లోకసంద్రంలో
మునకేసి తడిసి
తుడుచుకోరాని నెమలిపిల్లలా
నిలబడుతుంది
లోకాన్ని
తన అద్దంలో చూపించి
కమ్మల మీద
బొమ్మ చేసి
కాలానికి ఆరబెడుతుంది

అన్నట్లూ
కవిత్వం ఎప్పుడూ
కవి పక్షమే
కవే
ప్రజల పక్షం

*(ఆదివారం వార్త డైలీ, 22 సెప్టెంబర్ 2013)*

# గొలుసు రాత

తపించే సమయం లేక
అదేపనిగా చరిస్తుంటామా
కలలో కొన్ని పాదాలు
కదిలి వస్తాయి
మెలుకువలో కుదురుకున్న పదాలు
ఎందుకనో భంగపడ్తాయి
ఎప్పుడైనా పనికొస్తుందని
నీళ్లలో ఈదడం నేర్చుకున్నట్లే
విమానం ఎక్కిన ప్రతీసారి
ఎన్నడూ పనికిరాని
లైఫ్ జాకెట్ పాఠం శ్రద్ధగా వింటాం
రాసిన కవిత్వంలో
హుషారైన వాక్యాలు కూడా
ధోకా చేసినప్పుడు
ఎప్పుడూ నడిచిన నేలమీదే
ఒకప్పుడు జారిపడ్తాం
పగలబడే లోకం ముందు
కొత్త సంకేతాలతో మొకరిల్లుతాం

దిక్కులు పిక్కటిల్లే దు:ఖ ఘోషను
కవిత్వంగా సాధన చేస్తాం
చుట్టూరా తరచిన కొద్దీ
అర్థంకాని అంతరంగాల మాయ
ఎంత ప్రయత్నించినా
అంతుచిక్కని
గొలుసురాత లాంటి మనుగడ
ముందుకు సాగుతున్న కొద్దీ
మన ప్రమేయం తగ్గిపోవడం గురించి
రాస్తూనే ఉంటాం

*(ఆంధ్రభూమి డైలీ, 22-12-2014)*

# జలదృశ్యం

మైసమ్మను నెత్తిన మోస్తూ
నిరంతర ధ్యాన ముద్రలో
నిశ్చలంగా కూర్చుండిపోయేది కట్ట.
జీవానికి పర్యాయపదమై
కాలానికి వారధికట్టి
తెరుచుకుంటూ మూసుకుంటూ
పంటకు ప్రాణం పోసేది తూము.
పరువంలో పడుచువాడిలా
వాన వంతెన మీంచి దూకి
గంతులేసేది అలుగు

శికం నిండా జలం
పరిసరమంతా చిత్తడి
అందిన మేరా ఆకుపచ్చ తివాచీ పరిచే
మబ్బు తునకల గలగలలు

నీటి అద్దం మీద కొంగలు
సింగారించుకునే దృశ్యం
శత సహస్రాలుగా విస్తరించే

జీవరాశి పరిమళం
తీతువు పిట్టలకు
చాకిరీ చేసే తుమ్మకొమ్మలు
లంగరేసిన ఓడ జెండాలా
గాలికి ఎదురీదే చెట్ల సమూహం
దీపం చుట్టూ మెరిసే వెలుగు రేఖల్లా
జారుతున్న పంట కాలువ గట్ల మీద
పూల తీగల పులకరింతలు
తల్లి ఒడిలో ఖుషీ చేసే పిల్లవాడిలా
జల దృశ్యం ముంగిట ఊరు

అవసరం మిక్కుటమై
అలుగుకు గాట్లు పెట్టకముందు
వాడకం వైరమై
తూముకు తుప్పు పట్టక ముందు
బోర్ల తూట్లు పడి
జలగర్భం విచ్ఛిన్నం కాకముందు
నీటి ముద్దుల్తో నునుపుదేరిన
పరుపు బండల పక్కటెముకల మీద
బహుళ అంతస్తులు మొలవక ముందు
జీవనం శికస్తుకాకముందు
ఇక్కడొక నాకలోకపు నఖలుండేది
దాన్ని ఎవరు పునర్నిర్మిస్తారు!

*(సోపతి, నవతెలంగాణ డైలీ, 15-2-2015)*

# నటన దాని నైజం

కుర్చీల నగిషీలు పొదిగిన మణులు
మకుటాల మెరుపుల్ని
ద్విగుణీకృతం చేసే కెంపులు
దూరం పెరిగినందున ప్రతిఫలించే నునుపు
మేలిమిగా మెరుస్తుంటాయి
నిజానికి
గొప్పదేదీ పైన ఉండదు
అక్కడ
అవసరం కోసం
అన్ని బంధాలు పునర్నిర్మితమవుతాయి
ముసుగు కనిపించనంత
పల్చని నటనలు పండిపోతాయి
అందర్నీ స్తుతిస్తూ
తమ మీద దృశ్యాన్ని కేంద్రకరించుకుంటారు
దాని రూపం నున్నగా ఉంటుంది
మెత్తగా ఉంటుంది
పరాకాష్టకు చేరిన ఉదాత్తతలా
గుంభనంగా, జాలిజాలిగా
హాయిహాయిగా ఉన్నట్లే ఉంటుంది
తెర మీద అందరికీ

అందినట్లే ఉంటుంది
మనతోనే మాట్లాడుతున్నట్లుంటుంది
నిజం అర్థమయేలోపల
అక్కడికి చేరగలమో లేదో
తేల్చుకునే లోపల
దాని కాలం పూర్తవుతుంది
పథకాల గుట్టు బయల్పడే లోపల
అది యేరు దాటి పగలబడుతుంది
నటన దాని నైజం
అది, సామాన్యులకు
నిజ మాన్యులకు
అందనంత దూరంగా ఉంటుంది

*(ఆంధ్రభూమి డైలీ, 28-12-2015)*

# మెమెంటో

జైత్రయాత్రకు అంటిన నెత్తుటి మరకల్లా
అక్కడ ఖరీదైన మెమెంటోలు
లోగిలినిండా పటాటోపాల్ని
ప్రదర్శించే వింతరంగుల ఫ్రేములు
వీరభక్తికి దొరికిన లైసెన్సుల్లా
తాపడం చేసిన విగ్రహాలు
పదవులకు చెక్కిన నగిషీలలా
చిత్రవిచిత్రమైన షీల్డులు

ప్రేమకావ్యంలో
కాటిసీను పద్యంలా
మంత్రిగారు జాషువాతో మమేకమైనట్టు
ఒకచోట
లలిత సంగీతంలో
హార్డువేర్ అభివృద్ధి మెలికపడి
మంగళంపల్లితో పరాచికాలడుతూ
ఒకచోట
జోరుగా రిగ్గింగు జరుగుతున్న చోట
రాజయ్య బాతిక్ బొమ్మకు

సలాం చేస్తున్న మెమరీ
ఒకచోట
అంతర్జాలంలో
తాళపత్రం వెతుక్కున్నట్లు
బార్ కౌన్సిల్‌లో
సత్యదేవతను నెత్తికెత్తుకున్న ఫొటోఫ్రేం
ఒక చోట
పాంచ్‌తారాభవన్
ప్రారంభోత్సవంలో ఇచ్చిన
పేదరికపు దైన్యాన్ని
అద్భుతంగా చిత్రించిన మాడరన్ ఆర్ట్
ఒకచోట

జ్ఞాపకాలు లేవు కాబోలు
ఆయన ఇంటినిండా
అనేకానేక జ్ఞాపికలు

జ్ఞాపిక అంటే
కాలం వెనక్కి తిరిగి
ప్రేమాత్మకంగా చేసే మువ్వల శబ్దం
ఇంటినిండా జ్ఞాపికలు సరే
మదిలో చిరకాలం నిలిచే జ్ఞాపకాలు
కొన్నైనా ఉండితీరాలి

*(సోపతి, నవతెలంగాణ డైలీ, 22-3-2015)*

# చెక్కడం

చెక్కడమంటే
రాతిని
ఉలితో ఆకృతులు ఆకృతులుగా
మలచడమొక్కటే కాదు
దిద్దడమంటే
తెల్లని కాన్వాసు మీద
వింతరంగుల విన్యాసపు
సృష్టి మాత్రమే కాదు
తీర్చడమంటే
నునుపైన కొయ్యలో
మోహనాకృతుల్ని ఊహించి
ఉపరితలానికి తేవడమొక్కటే కాదు
వాక్యాలను పదాలుగా
పదాలను అక్షరాలుగా
అక్షరాలను స్వరాలుగా
ప్రాణప్రతిష్ట చేయదగ్గ
విన్యాసమొకటుంది.
కర్రసాములో జైతయాత్ర చేసినట్లు

అక్షరాలతో ఆనందభైరవి ఆలపించిన
అప్పటి తిలక్
పదాలతో
పరవశాల జడివానల్ని కురిపించే
ఇప్పటి ఆశారాజుల్లా
శతాబ్దాల పర్యంతం
చెక్కుచెదరని
కవిత్వాన్ని చెక్కాలి
చిరకాలం గుర్తుండే
వాక్యాల్ని
పోతపోయాలి

*(ఆదివారం ఆంధ్రప్రభ డైలీ, 9 ఆగస్టు 2015)*

# నాన్న

జీవం చుట్టూరా
మెలికపడ్డ ఆవరణాన్ని జ్ఞాపకం చేస్తూ
మేఘాన్ని ఆశ్రయించిన మెరుపులా
ఆత్మ చుట్టూ అల్లుకుపోయే
ప్రాకృతిక ప్రేమ కవచం నాన్న

వైశాఖపు మండుటెండలో
నిండారా పరుచుకునే
కానుగ చెట్టు నీడ
జడివాన అలజడిలో అల్లాడుతూ
నింగి ధారలకే ఎదురు తిరిగే గొడుగు
దిక్కుతోచని
సందిగ్ధ సందర్భాలలో
సరళీకరించిన గీతావాక్యం
అన్నిచోట్లా దేవుడు ఉండలేక
అమ్మను సృష్టించినట్లే
అమ్మకు శక్తినీయమని
నాన్నను పంపించాడు

చిరువిత్తనంలా కనిపించే నాన్న
పెనుమర్రిలా మనపై
ప్రేమ నీడను విస్తరిస్తాడు
భావజాలపు ఇనుప గుగ్గిళ్లను
ద్రాక్షపండ్లలా
అలవాటు చేస్తాడు

సమస్త విశ్వమూ
శత్రుశిబిరమై తలపడ్డప్పుడూ
నాన్న ఒక్కడే తోడై
ముందుకు నడిపిస్తాడు
దీపం నుండి
దీపం ప్రభవించినట్లు
పిల్లలకూ
నాన్నతనపు ఔదార్యాన్ని అందిస్తాడు

*(ఆదివారం ఆంధ్రప్రభ డైలీ, 21 జూన్ 2015)*

# కవిత్వమొక ప్రపంచం

ప్రపంచంల
కవిత్వమొక ప్రపంచం
మునిగినకొద్దీ మణిదీపాల వెలుగులో
నివ్వెరపోయే సముద్రంలాంటి
ప్రపంచం
భాషతో మొదలవుతుంది కాని
అదెప్పుడూ అక్కడ
ఆగిపోయిన దాఖలాల్లేవు
పెనుమర్రి లాంటి భావలోకంలో
సరిహద్దుల్ని తుత్తునియలు చేసే వింత
ప్రపంచం
భాష తెలియకున్నా
పరిభాష ద్వారా
భావప్రసారం చేసే
సుందర ప్రపంచం
ప్రపంచలో
కవిత్వమొక ప్రపంచం
అది
సరిహద్దులకు  అడ్డంగా నడిచినందుకు
నేనందులో చేరిపోయాను

*(ఆదివారం ఆంధ్రప్రభ డైలీ, 5 ఏప్రిల్ 2015)*
*'కొత్త సాలు' సంకలనం)*

# వాయుముద్ర

వసంతంలో పూలగుత్తులు నాట్యమాడినట్లు
ఒక నిస్తంత్రీ స్పర్శ వీస్తుంది

నిశ్చలమైన నీటిమీద అలలు మొలుస్తాయి
ఉన్నట్లుండి జల్లులు కురుస్తాయ్
కనిపించని లోకం నుండి మరిచిన గొంతు
గంగలా నేలకు జారుతుంది

పక్షులు వసంతాన్ని తలుచుకొని కూస్తాయి
లేళ్ళు కరిమబ్బుల్ని ఊహించుకొని నాట్యం చేస్తాయి
అడవి దారిలో ఆశ్వాలు పరుగు పెడుతాయి

ఆ స్వరం కర్ణభేరి ద్వారా హృదయాన్ని హత్తుకుంటుంది
దుమ్ము పట్టిన వీణ తీగను అదే పనిగా మీటిపోతుంది
జ్ఞాపకాల సీమ సరిహద్దుల్ని తట్టిలేపి
ప్రమత్తపు లోక పరిమళంలో వింత అలజడి చెలరేగుతుంది
ఇక ఎప్పుడూ ఆ వాయుముద్రకోసమే
మనసు సూదంటు రాయై ఎదురు చూస్తుంది

*(నెలవంక నెమలీక మాసపత్రిక, 13 మార్గశిర మాసం 2015)*

# పాలపిట్టలా ఒకరుంటారు

కలిసిన ప్రతివారూ
క్షేమమడుగుతారు
వరసైన వాళ్ళు
వయసు పొరల్ని తట్టి లేపుతారు
వయసుకు పెద్దైన వాళ్ళు
ఎగాదిగా చూసి
ఎంత పెద్దయ్యావని
ఆశ్చర్యం ప్రకటిస్తారు
కాలిబాటన నడుస్తుంటే
ముండ్లుంటాయని
ప్రేమాత్మక హెచ్చరికలు చేస్తుంటారు
అనుకుంటే ఆకాశంలో ఎగరవచ్చని
ఉత్సాహపు బెలూన్లు ఊదిపెడతారు
వడివడిగా నడుస్తూ ఉంటేనో
ఉద్వేగంతో ఉరుకుతూ ఉంటేనో
నిన్ను మించిన నిజ నాయకుడు
లేనే లేడంటారు

పరుగు ఎప్పుడూ నడవదు కదా!
అప్పుడప్పుడు
నీతుల ఎడారుల్లో

దిక్కులు కోల్పోయినప్పుడు
ఆకాశవీధిలో
ప్రాణవాయువు అంతర్ధానమై
ఊపిరికి పరీక్ష పెట్టినప్పుడు
వెలిగిపోయిన కొలువుల నెలవులు
వెలవెలబోయినప్పుడు
కాలం క్రమంగా
పదమటి ఆకాశానికి చేరినప్పుడు
ఎదురుగా వచ్చినవాళ్ళు
ఎప్పుడూ ఎరగనట్లు నటిస్తుంటారు
సుపరిచితులంతా
అపరిచితుల్లా తప్పుకుంటుంటారు
వారంతా అటువైపే
అడుగులు వేస్తున్నామని మరిచిపోతారు
విప్పని మూటలోని రహస్యంలా
వాళ్ళ క్షణాలూ
ముందే రాయబడి ఉన్నాయని
తెలుసుకోవడం మరిచిపోతారు

అప్పుడు కూడా
దసరా జమ్మి పంపకంలో
అలసిపోయాక
అరుదుగా కనిపించే
ఆహ్లాదకరమైన పాలపిట్టలా ఒకరుంటారు
అయితే ముందే వారిని గుర్తించడానికి
అసలైన విజ్ఞత కావాలి

*(నవతెలంగాణ డైలీ, 23-11-2015)*

# గూట్లో దీపం

పొద్దుగూకక ముందే
గూట్లో దీపం పెట్టడం మంచిది
హుషారుగా ఉన్నప్పుడే
పిట్ట ఎగిరిపోవడం ఉత్తమం

సమస్త యవ్వనాన్ని
సాగరం ఈదడానికి ధారపోసిన
వ్యధలెవరూ వినరు
తరాన్ని కాలరేఖ నుండి ముందుకు
జరపడానికి
కలెబడ్డ పౌరుషాల్నెవరూ
ఆవాహన చేసుకోరు
సకల శక్తుల్నీ
మస్తిష్కంలోని సమస్త ప్రణాళికల్నీ
హృదయ కవాటం నుండి జారిన
స్వేదరూపపు రుధిరాల్ని
సమీకరించి తపస్సు చేసామంటే
హేళన గలగలలు వినిపిస్తాయి

కీళ్ళనొప్పుల క్రీడా విన్యాసాల్ని
మరిపించే గాయాల మాటలు వాళ్ళవి
గుండెపోటుల్ని గుర్తుచేసే
గునపాలు వాళ్ళ గొంతుల్లో

ఒకరికి పెట్టావని ఒకరు
మాటల తూటాలు పేలుస్తారు
వీళ్ళ పాలకోసమే తిన్న రోజుల్ని
వీళ్ళ మురిపాల కోసమే నవ్విన గడియల్ని
ఇప్పుడెలాగూ చెప్పలేను
ఈ 'కన్నా'ల మాటలు
వీళ్ళ 'కన్నా'ల భవిష్యత్ వాక్యాలు
కాకూడదనే తలపోస్తాను
తీరం దాపున నావలాంటి
యవ్వనం జారిపోయాక
కాలు వణుకుతుంది, కన్ను అదురుతుంది
దేహంలోని సమస్త శక్తులూ తిరగబడతాయి
ఇక ప్రతిమాటా చేదుగుళికే అవుతుంది
ఎవరూ ఈ లోకానికి ఎక్కువ కాలం అక్కరలేదు
అందుకే
పొద్దుగూకక ముందే
గూట్లో దీపం పెట్టడం మంచిది

*(ప్రజాశక్తి దినపత్రిక, 15-12-2014)*

# భయం

దానికొక రూపం ఉంటుందని
భ్రమలో ఉండే వాళ్ళం

మారణాయుధం ఎదురైనప్పుడు
క్రూర మృగం మోరలెత్తినపుడు
అంతులేని అగాథం అంచున
దిక్కుతోచక దిగాలు పడినప్పుడు
చీకటి చిందులేసినప్పుడు
స్వార్థం గుప్పిట్లో బందీలమని
భ్రమపడే వాళ్ళం

దొరతనపు స్వభావం లాగ
శత్రువుల రూపంలాగ
కనిపించని వేదనలాగ
భయం కూడా
అదృశ్యం

ఒక వార్తలానో
సంచారవాణిలోనో

సంక్షిప్త సమాచారంగానో
ఈ సందేశ రూపంతోనో
భయం భూతం రావొచ్చు
చేయని తప్పులకు
రాయని రాతలకు
ఊహించని లోతులకు
దిగి
నీ గుండెల్లో
గునపాన్ని దించవచ్చు

పరిహాసపు ప్రశ్నలానో
వంకర విచారణగానో
అడిగీ అడగనట్లు
ఇంకెవర్నో విచారించినట్లు
నీ ముందు భయం తిరగాడుతుంది

భయం మహా మాయావి
దానికి రూపం లేదు

*(ఆంధ్రభూమి డైలీ సాహితి, 18 ఏప్రిల్ 2016)*

# ఉన్నతి

ఇదేమి ఉన్నతి
రోజులు గడిచి
కరడు గట్టుక పోయిన
మిఠాయి పొట్లంలా
కాలం గాని కాలంలో పండి
ఎవరికీ అందకుండా పోయిన సీతాఫలంలా
వాడకానికి ఎంత మాత్రమూ
పనికిరాకుండా తుప్పుకొట్టుకుపోయిన
పాత చెతక్కులా
ఇలా ఉందేం నేస్తం
ఉద్యోగంలో ఉన్నతి?!
క్షణికావేశంలోనో
దిక్కుతోచని ఆవేదన తోనో
ఏనుగ్గాడో మారు దీన్ని
పతనోన్నతి అన్నాడు గానీ
వాడి మాట ఇలా
తహసిలాఫీసులో గుద్దిన
రౌండు సీలులా
నల్లసిరాతో చేసిన సంతకాన్ని తీసిన

ఫొటో కాపీలా అచ్చుపడుద్దని
ఎప్పుడూ అనుకోలేదు
గోడకేసిన సున్నంలా
కవిమాట ఇలా
అంటుకుపోవలసిందేనా!

*(ఆదివారం ఆంధ్రప్రభ డైలీ, 19 ఆగస్టు 2012)*

# క్రీడ

కొందరికి జీవితమే క్రీడ
రెవెన్యూపై బాధ్యతల క్రీనీడ
ఆట లాగుతుంటే
ఆఫీసు సాగుతుంటే
బాధ్యతల సునామీలో మునిగి
తెగని పని గనిలో నలిగి
ప్రభాత సంధ్యల హద్దులు చెరిగి
నమ్రభాషా జవాబులతో అలసి

మీటింగుల వడదెబ్బలు
సమీక్షల ఛర్నకోలలు
టార్గెట్టుల చురకత్తులు
ప్రోటోకాల్ పొరపొచ్చాల్
ఇన్‌స్పెక్షన్ ఇంటరాగేషన్
తొలుస్తుంటే మెదడునెక్కి
కొలువై ఉంటే గుండె గూటిని
ఆటల్లో ఆనందం ఆవిరి
పాటల్లో పదబంధం అలజడి

బిగదీసుకొని వడిసెల విసిరినట్టు
గ్రీష్మంలోనూ కోయిల కూసినట్టు
పలుగురాళ్ళ మధ్య పంటలు పండినట్టు
బాంబుల మధ్య ప్రేమలు విరిసినట్టు
పాడాలి గదా పాటగాళ్ళం
ఆడాలి గదా !
జీవితంపై అపారమైన ఆశలున్నవాళ్ళం

*(రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ మాగజైన్)*

# ముప్పయొక్క దీపాలు

చరిత్ర
అడుగు తీసి అడుగు వేస్తున్నది
పడిలేచే పసిపిల్లవాడి నడకల్లా
కాలం కనిపించకుండా కదుల్తున్నది
పదిజిల్లల తెలంగాణ
అందెశ్రీ పదాల గుడారంలో
బంగారపు రంగుల్లో సేదదీరుతున్నది

డొంకల్లో
బాటమలుపు తిరిగిన చోట
జ్ఞాపకాల ముల్లెలు జారిపోతై
నీలగిరి ముక్కలుగా విడిపోయి
బతకనున్న అమీబా తల్లి

పాలమూరు
వలసదైన్యం మీద
కన్నీరొత్తుకున్న అవ్యాజం
వ్యాకుల పడుతున్నది

వేరుపడ్డప్పుడు
పాలుపంచుకున్నప్పుడు

అనిర్వచనీయమై ఉద్విగ్నత
ఎలగందుల ఖిలా శిలా నేత్రాల్లో
కన్నీరై ఉబుకుతున్నది

కాకతీయ ఏలిక భూమిక
నలుచెరగుల విడివడడం
నందన వనాల సృష్టికేనా
ప్రజా కేతనాల రెపరెపలకేనా
కాలం లిట్మస్ పేపర్ తెరిచి చూడనుంది

ముప్పయెనిమిదేళ్ళ
అల్పాయుషు ముగిసి
రంగారెడ్డి ఒక పక్క ఒత్తిగిలింది
నిర్వికారంగా

మెతుకుసీమ ధాన్యరాశి
మూడుబండ్లకెత్తి తీరాలిక

అవసరమైనదొకటే
ఆదిలాబాద్ కేరింత
నలుచెరగుల వినిపించాలెనన్న
తప్తహృదయ కదలిక
అస్పష్టంగా వినిపిస్తున్నది

ఇందూరు మండల పద్యం
ఇరువైపుల గాత్రమై సాగి
మట్టిపూలతో అర్చిస్తున్నది

గోదారిపాయ భద్రాద్రిలో
రెండై గలగలలాడుతుంది

భాగ్యనగరం భవ్యనగమై
మౌన గంభీర మహరాణిలా
శిల మీద చెక్కిన చిత్తరువులా
బహుభాషల లుప్తవాక్కుల
మహాతపోదీక్షలో మునిగింది

కొత్త దీపాల శాస్త్రీయత
ప్రశ్నించిన నోళ్ళు
మా ఇంటికైతే కొత్తవెలుగులు
రావలసిందేనని వీధికెక్కాయి

దీపాలు కదా
అంటించిన కొద్దీ
విస్తరిస్తూ పోయినై
వెలుగుల మీదున్న ప్రేమకు
మట్టి బహువిధ రూప
విన్యాసాలకు కేరింతలే
అయితే
దీపావళి నాడున్న శ్రద్ధ
ఎప్పుడూ కావాలె
పెట్టిన ముప్పయొక్క దీపాలు
దివ్యంగా వెలిగేట్లు చూడాలె

*(11-10-2016న తెలంగాణలో 31 జిల్లాలు ఏర్పడ్డై)*
*(2016 లో ఆకాశవాణి దీపావళి కవిసమ్మేళనంలో చదివిన కవిత)*

# పాలపిట్ట

మాటకూ
మనుగడకూ
తేడా ఉంటే కదా?!
కవిత్వానికీ
జీవితానికీ
అడ్డుపొర ఉంటే కదా?!
ప్రేమకూ
కోపానికీ
ప్రణాళిక ఉంటే కదా?!

ఇవేవీ లేనప్పుడు
ఆయన గురించి
మాట్లాడేదేముంటుంది?

బస్సెక్కుతావా?
బైకు తొక్కుతావా?
కార్లో నక్కుతావా?
సభకు రావాలంటే
ఠంచనుగా రావాలంటాడు
పుస్తకాలు కొనుక్కుంటావా?
గూగుల్లో పునుక్కుంటావా?
రాస్తానంటే, వ్యాసం

ఒకరోజు ముందే రాయాలంటాడు
ఏదీ తాగుబోగు వాచాలంలా
వాగకూడదని
చేతగానిది ఎప్పుడూ సైయనగూడదని
కాలం గాని కాలంలో
రానేరని గాలిని నమ్మి
తూర్పార బట్టగూడదని
క్రాంత దర్శనం చేసి చేతల ఛర్నాకోలల్ని జాడిస్తాడు

కవిత్వం చెప్పినా
కథ లోతులు విప్పినా
వేదికలెక్కినా
వాదం చేసినా
మార్క్సిజం గీటురాయి
తెలంగాణ ఆచరణ సోయి
బోరుపొక్కలు నోరు దెరిసినప్పుడు
రైతుల దు:ఖానికి కరిగినప్పుడు
ఉరితాడై ఊగిన
శ్రమజీవుల దైన్యాన్ని తరచినప్పుడు
కవిత్వపు పాలపిట్టై
కర్తవ్యగానం చేస్తాడు
పదవులు సూదంటు రాళ్ళై
గిరికీలు కొడుతున్నప్పుడు
పురస్కారాల వెండివెన్నెల
నలువైపులా వెంటాడుతున్నప్పుడు
గోధూళిని కోరుకున్న
పల్లెతల్లిలా తేటపడతాడు

మద్యంపై ఉద్యమం నడిచినప్పుడు
తాగుడు తప్పేనని ఒప్పుకొని

మళ్ళీ ముట్టని మనసున్న కవి
చాలామంది
ప్లేటు ఫిరాయించారంటే
నమ్మిందే మాట్లాడమని
మాట్లాడిందే ఆచరించమని
కుండబద్దలు కొడతాడు
ఆయన సిధారెడ్డి
కాదు
పరమ నిబద్ధారెడ్డి

# మేలు

ఎన్నని రాసుకుంటవ్
ఎన్నని దాచుకుంటవ్
మస్తిష్కంలో
నిక్షిప్తం చేసుకోవడం మేలు
హృదయంలో
పదిలపరుచుకుంటే పదివేలు

# రోజు

పుస్తకాలు లేని ఇల్లు ఎడారి
కలర్ టీవీ లేని లోగిలి రాదారి

చదవని రోజు
ఏమాత్రం ఎదగని రోజు
ఏదీ రాయని రోజు
ఎంతో కోల్పోయిన రోజు

# కాకతి మాతకు జేజే

పీఠభూమికి
నీరు లేదన్న కన్నీటి దిగులు తుడిచి
సంద్రానికి సంక్షిప్తిని ఊహించి
నీటి ముద్దల కింద పోతపోసి
ఊరూరా అతికించి పోయిన
అపర భగీరథులు వాళ్ళు

కాలపు శైథిల్యానికి ఎదురొడ్డే
కట్టుకాలువను తలపోసిన
క్రాంతదర్శులు వాళ్ళు

బిడ్డల ఆకలిని తడిమిచూసే
కన్నతల్లి మనసులా
పంటలను సృష్టించే కాలువ నీటి ప్రదాతలు
తూముల్ని దిద్దిపెట్టిన
పితృప్రేమలు వాళ్ళు

కుంట నిండుదనాన్ని
కొలవేసే అలుగుల్ని
కట్టిపెట్టిన అపరమయులు వాళ్ళు

వారి మనోనేత్రం నిండా
ముందు తరాల పండువెన్నెల
కాలవాహినిలో కదిలిపోయే
కమనీయ పంటపొలం

కావ్యం తర్వాత
కాలానికి ఎదురీదిన
మహాగొప్ప మానవావిష్కరణలు
కాకతీయుల మానసపుత్రికలు

కాకతి మాతకు జేజే
ఆ పేరును తలిచే
చెరువుకు జేజే

# సరిహద్దుల్ని ధిక్కరిస్తూ

సరిహద్దులను ధిక్కరిస్తూ
శీతవాయువు విస్తరిస్తుంది
ఆవరణాన్ని దాటుకుంటూ
వెలుగురేఖ పుడమిని చేరుతుంది
మైదానాన్ని, కొండల గుంపునూ
సాగరతీరాన్నీ, కీకారణ్యాన్నీ
ఏకం చేస్తుంది జడివాన

ఎక్కడ పిడుగు రాలిందో
ఎప్పుడు తుఫాను జాడించిందో
నగ్ననేత్రాలు తెరిచీ
ఎవరూ చెప్పరు
సరిహద్దుల్ని చెరిపివేస్తూ
లోకం కోసం తప్ప
ఏవీ తమకోసం తాము
చరిస్తున్నట్లు లేవు

ఒక గోవు
సమస్త గోశాలల్తో
దోస్తీ కడుతుంది

పిచ్చుక
అన్ని దేశాల పిచ్చుకలతో
సంభాషిస్తుంది
అన్ని నెమళ్ళ నాట్యం
ఒకలాగే ఉంది
కాకిభాష అంతటా ఒకటే
మనల్ని కంపార్టుమెంట్లుగా
విభజిస్తున్న భాష
వరమా? శాపమా?

ఉన్నచోటు నుండి
నాలుగడుగులు
ముందుకో వెనక్కో వేస్తామా!
మనల్ని మనం
పరాయి దేశంలో చూసుకుంటాం
మనం లేపిన
గోడల నీడలు
ఎంత కురుచవి!

*(విశాలాక్షి మంత్లీ, మార్చి 2017)*

# ఆమె

మనసైన మహారాణి
సొగసైన విరిబోణి
మాటాడినా, మౌన
ముద్రేసినా
హృదయాన్ని వెలిగించు
తైలమే

మకుటాలు లేకుండ
మాన్యులుంటారని
రాజ్యాలు లేకుండ
రాణులుంటారని
పూలగంధపు పూర్వ
రూపమే ప్రసూనమని
చిరకాల స్నేహాల
మాలలల్లాలని
పూలతోటల తోడ
వారధే పరిచింది
మనసెల్ల మురిసింది

మనసైన మహరాణి
సొగసైన విరిబోణి
మాటాడినా, మౌన
ముద్రేసినా
హృదయాన్ని వెలిగించు
తైలమే

# జీవజలం

సురచే సుఖించిన శుక్రుడున్నాడు
హుక్కా మత్తులో ఊగిపోయిన
నవాబుల విలాసాలున్నాయి
స్వర్గాన్ని దించిన మధుపానపు
కథలెన్నో కళ్ళెదుట కదుల్తాయి

ఇప్పుడు చాయ్ ఒక్కటే
మహాదుర్మార్గపు ఇరానీ కత్తిలా
మన కుత్తుకలు తరిగినట్లు
ప్రచారం ఎంత మూర్ఖం
అందులో కెఫిన్ ఉండొచ్చు
టీలో కలిసే పాలను జీర్ణించుకునే శక్తి
మనలో లేకపోయి ఉండొచ్చు
ఎముకల చూర్ణం కలిపే ప్రచారంలో
శతాంశం నిజం కూడా ఉండొచ్చు
అర్ధరూపాయి నుండి
ఐదు రూపాయలంత ప్రియమైపోవచ్చు
ఫలక్‌నుమా లేని పాతబస్తీని

ఇరానీ చాయ్ లేని హైద్రాబాద్‌ని
ఎలా ఊహించగలం!
తేనీరని మురిస్తే తెలుగువాళ్ళు
చాయ్ సిరఫ్ జిందగీ అనే నగరీకులు
అందరి ప్రేమ పానం
అందరికీ అందే జీవజలం
ఒక్కరోజు లేకున్నా
ఒక్క పూట కాదన్నా
మన ఆనందం మటుమాయం

# అమీబా

శత్రువు అమీబా
వాదమొక వాహిక
లక్ష్యం ఇప్పట్లో అర్థం కాదు

పరిచితం కాని పంచాయితీ నడుమ
ఇటో అటో చూస్తుండగనే
ఆయుధాలు సిద్ధమైతై
నాయకులు మొనదేర్తరు
మనం ఏదో ఒక శిబిరం వెంట నడవాల్సిందే
మనకు అంతా అర్థమయ్యేసరికి
రెండు శిబిరాలూ వాళ్ళవే

# ఆట !

అవని, పూల తివాచీ పరిచి పిలిస్తే
పాదాల తేరెక్కి
పయనించడం ఆట
నింగి, సిగలోన
నీలిమబ్బుల్ని తురుముకున్నప్పుడు
పచ్చిక మైదానంలో
ప్రాయం పరవళ్ళు తొక్కడం ఆట

నీరెండ సాయంతనంలో
బోటి గుండు మీద
ఆచ్ఛాదనం మరచిన పాదాలతో
గలిబిలి గంతులేయడం ఆట
పచ్చిక బయళ్ళు ఎడం జరిగి ఇచ్చిన
పిల్ల బాటల మీద పరుగుల్ల
జారి పడి నవ్వినప్పుడు ఆట

ముగ్గుల నడుమ నియంత్రించిన
మీటర్ మ్యాచ్ కదలికలు
వేదికల మీద ప్రణాళికలు పరిచిన

హార్ట్‌లెస్ శాస్త్రీయ క్రీడ
టీటీ, క్రికెట్, బ్యాడ్మింటన్‌లను మించిన
హృదయాహ్లాదులు
పోటీ లేని ఆటలు
గెలుపోటముల్లేని మాటలు
పదాల పూలగుత్తుల్ని దాల్చిన
వచ్చీరాని పాటలు
వయసెరుగని
అంతరమెరుగని
సౌందర్య దృష్టి పట్టని
శాస్త్రాల లోతు తెలియని
గంతులే
అసలైన ఆట

*(నెలవంక నెమలీక మాసపత్రిక, పుష్యమాసం, 2017)*

# గాయపడ్డాకే

గాయపడకుండా
ఉండాలనుకుంటాను
నిద్రలేచింది మొదలు
కనిపించని బాణాలను
కనిపెట్టుకొని తిరగాలనుకుంటాను
అడుగు బయటపెట్టింది మొదలు
ఏ మాటల తూటా తగలకుండా
ఒడుపు చేసుకుంటుంటాను

దారిలో నడుస్తుంటే
'చక్కగా నడవరాదా' అంటారొకరు
వాహనం మీద పోతుంటే
డ్రైవింగ్ ఎక్కడ నేర్చుకున్నావంటారొకరు
ఏదైనా వస్తువు ధర అడుగుతుంటే
నీకు బేరం చేయడం వచ్చా అని
దెప్పిపొడుస్తుంది ఆవిడ
చిన్న బాణాల గాయాలు
మాన్పుకుందామని ప్రయత్నిస్తుంటానా
పెద్దపెద్ద అభాండాల జడివాన
అమాంతంగా మీద కురిసిపోతుంది

తేరుకోకముందే
తేనెపట్టు నుండి కందిరీగలు లేచినట్లు
ఏవో వార్తల బాంబులు పడి
కనిపించని పొగలు లేస్తాయి
నిజాన్ని వీలైనంత వివరంగా
చెప్పడానికి ప్రయత్నిస్తాను
వెక్కిరించే నొసళ్ళ మీద
సత్యపు సమాధానాల్ని
నమోదు చేయజూస్తాను
గాయానికి లేపనాన్ని
పూయజూస్తాను
గాయపడకుండా
ఉండాలనుకుంటాను

కనిపించని యుద్ధరంగంలో
వినిపించని బాంబులమోత
అదృశ్యంగా ఆయుధాలు
సదృశ్యంగా తేనెపలుకులు
ప్రకటించే నీతుల మధ్య
బయటపడని ఎజెండాల నడుమ
అన్ని చురకత్తుల్ని
తప్పించుకోవాలనుకుంటాను
గాయపడకుండా
ఉండాలనుకుంటాను
చివరికి
గాయపడ్డాకే ఇల్లు చేరుకుంటాను

*('కొత్త సాలు' సంకలనం)*

# ఓడిపోవడం

ఎవరి చేతిలోనైనా ఓడిపోయి
తనివితీరా తృప్తిపడాలనుకున్న
రోజూ అందర్నీ దబాయిస్తున్న కదా అని
ఇవాళ ప్రాయశ్చిత్తం కోసం
పరుగు తీద్దామనుకొని
రోడ్డెక్కిన

నేను ఎడమచేత రాసిన
కవితా వాక్యాన్ని
లోకం కళ్ళకద్దుకుంటుంది
నిర్లక్ష్యంగా జారీ చేసిన
ఆదాయ ధృవపత్రాన్ని
పిల్లలు నెత్తిన పెట్టుకుంటున్నారు
తొలినాళ్ళలో విడిపోయిన స్నేహితురాలు
ప్రేమలేఖతో ఎదురొస్తున్నది
రెండుగుర్రాల మీదనైనా
సవారి బాగానే కుదరిందంటూ
మిత్రులు హాస్యమాడుతున్నారు

ఎవరినైనా గెలిపించి
సంబూరపడుదామనుకుంటే
తట్టుకోలేని ఉక్కబోత మీద
ఒక్కసారిగా వాన కురిసిపోతుంది
డివైదర్ల మీద నూరు వరహాల చెట్లు
లయబద్ధంగా తలలూపుతుంటాయి
రోజూ విమర్శించే వాళ్ళొచ్చి
పూల గుత్తితోపాటు సంభ్రమాన్ని
బహుకరించి పోతారు
ఓడిపోవడానికి కూడా
చాలానే కలిసి రావాలి
గెలవడం మన చేతుల్లో లేనట్లే
ఇతరుల్ని గెలిపించడమూ
అంత సులభం కాదని
భ్రమను వల్లెవేస్తుంటామా

రేపు కలెక్టరేట్‌లో మీటింగు
వర్తమానం వచ్చేసింది
సమాజంలోని సంక్లిష్టతల మీద
ఆధిపత్యాలకు
ఆలవాలం కదా అది
ఇప్పుడు నమ్మకంగా చెప్పవచ్చు
ఇంక గెలవడం ఎవరి తరమూ కాదు

# హార్డ్ టు డీలిట్

ప్రతి కార్యానికీ
కారణముంటుందని తెలిసీ
కనుక్కోలేని హేతువు చుట్టూరా
గిరికీలు కొట్టడమే వేదన

మౌనం ఎక్కడ చెదిరిపోతుందో
మనసు ఎక్కడ కదిలిపోతుందో
వినీల గగనపు విహంగంగా
ఎప్పుడు చరిస్తామో
తెలియకుండడమే హేతువు

గోడకి అవతల ఏముందో
చూసిన వాడెవ్వడూ
ఇటు రాడే!
జన్మాతీత సత్యాలేవో
బోధించడానికి
***
కనిపించని వేల దారాలతో
కట్టుకుంటవ్
అర్థం కాని ఏ పురాబంధాలతోనో

ఆలోచనలన్నీ తిప్పుకుంటవ్
లంకె ఎక్కడ పడిందా అని వెతికి
సంకెళ్ళు విడదీద్దామని
క్షణం క్షణం విఫలమౌతుంటాను
అందీ అందని నందనవనంలో నువ్వు
దృశ్యాదృశ్యంగా విహరిస్తుంటావ్
నేను, మాయాతెరని తొలగిద్దామని
పదే పదే ఓడిపోతుంటాను

ఎంతకీ అందని
సింధూ నాగరికతలో
చిత్రలిపిలా నువ్వు
పాఠకుల్ని చేరని మహాకావ్యంలా
నేనూ
సమాంతరంగా

***

మెసేజ్‌లు
ఒక్క క్లిక్ లో డీలిట్ ఐతై
వాట్సాప్‌ను డిస్‌కార్డ్ చేస్తాను
నువ్వెక్కడైనా తగుల్తావేమోనని
ఫేస్‌బుక్ నుండి ఎగ్జిట్ అవుతాను
మొబైల్ డేటా సెట్టింగ్‌ను వదిలించుకొని
వైఫై  తరంగాల దహనం నుండి
నన్ను నేను దూరంగా
జరుపుకుంటాను
మనల్నెప్పుడూ వదిలిపెట్టని
గ్రావిటీలో భాగమైన
జ్ఞాపకాన్ని ఏం చేద్దాం!
మెమురీని కూడా డీలిట్ చేయదగ్గ

ఒక యాప్ ఉంటే ఎంత బాగుందు

***

రెప్పలు గాయపరచిన కంటినిండా
ఉద్వేగం జారిపోతున్నట్లు
అక్కడ చెదిరిపోతున్న
భీతావహ సౌందర్యం
కనిపించని పాశాలతో
మనల్ని కట్టేస్తుంది

స్నేహ సమీరంలో
రెపరెపలాడే పత్రకెరటాలు
గాజుకళ్ళ దు:ఖదారుల వెంట
లోయప్రవాహంలా సర్రున
దిగాలుకు ఉరుకుతుంటై

మబ్బులు ఎదరురై ఒరుసుకున్నట్లు
మనసులు ఒకటై అల్లుకున్నట్లు

మాయామేయలోకంలో
మనోవీధుల గుండా
పరుగు తీయలేని
నిర్బంధ పాఠాలు చెబుతుంటే

మనం ఒక్కరొక్కరుగా నిలబడి
కళ్ళతో కరచాలనం చేసి
అపార్థాల చిత్తరువు మీద
ఎప్పుడైనా నీరొంపుదామా

*(మూసీ మాసపత్రిక, జనవరి 2017)*

# జూన్ 2

నిజమైన కల!
మూసుకుపోయిన దర్వాజాలు
తెరుచుకుంటున్నై
దైవం దగ్గరి ద్వారం దగ్గర
గడ్డిపూలకు స్వాగత తోరణాలు.
దృశ్యం మారుతుంది
సృష్ట్యాది విశ్వకర్మ శిల్పతోరణం
జలకేళీ నడుమ
జనపదం గానం చేస్తుంది
పట్నం ప్రకృతికి
వంగినట్లు సలాం చేస్తుంది
అక్కడ గంటలు మోగుతున్నై
అదేపనిగా
పీఠభూమికి జయనాదపు
మంగళహారతులెత్తుతున్నై
మూసుకుపోయిన దర్వాజాలు
ఒక్కటొక్కటిగా
తెరుచుకుంటున్నై

***

భళ్ళున తెల్లవారుతున్నట్లున్నది
నల్లని కాళరాత్రి

నూతన వెలుగు రేఖల ముందు
తెల్లబోతున్నట్లున్నది
ఊపిరి బిగబట్టిన గాలి
మలయమారుతమై వీస్తున్నట్లున్నది
పండగతో నిమిత్తం లేక
కళల తోట నలుచెరగులా
పాలపిట్ట రెక్కలు విప్పి విహరిస్తున్నట్లున్నది
ఊహాకాశపు మేఘాలు
కొమ్మల కొసల మీద
చిగుర్లై పల్లవిస్తున్నట్లున్నది
తరాలు దాటిన తడబాటు
తన కాలి మీద నింపాదిగా
నిలబడి చూస్తున్నట్లున్నది
అదే నింగి
కురిసిన వర్షం
అదేపనిగా చిందేస్తున్నట్లున్నది
పొద్దుపొడుపు చిమ్మే రాగి రేకుల్లా
అన్ని జలపాతాల మీద
పసిరిక పటాలు చిత్రితమైనట్లున్నది
రాజు దున్నిన నేల
మైమరిచి రత్నాల్ని మొలిపించినట్లు
నియ్యత్ కొరకు నిలిచిన కోన
నీటితో నిమిత్తం లేని
పంటలు పండిస్తున్నట్లున్నది

మెదళ్ళు తిరగేసుకున్న గబ్బిలాలు
ఇబ్బంది పడొచ్చు
కళ్ళుండి చూడలేని
గుడ్లగూబలు హతాశులవొచ్చు
ఇప్పుడు 'జూన్ రెండు' అంటే

కాలం యవనిక మీద
సప్త వర్ణాల అద్దకం దిద్దినట్లున్నది
నవ తెలంగాణా
పురోగామి ద్వారం
తెరుచుకుంటున్నట్లున్నది

# హృదయానందం

అప్పటి కలల ఆకాశంలో
తరచూ ఇంద్రధనుస్సు వెల్లివిరిసేది
పూలతోట చుట్టూ చెక్కర్లు కొట్టినట్లు
చెప్పరాని అంతరంగ రహస్యాలన్నీ
అక్కడ ప్రదర్శనకు పెట్టినట్లుండేది
ఆదివారం మధ్యాహ్నానికి ముందే
ఈస్ట్‌మన్ మైక్ సైరన్ మోగుతుంటే
లేతప్రాయపు మనసు పిట్టలు
రివ్వున అభిమాన హీరోలకు
అభిముఖంగా లేస్తుండేవి
ఏ సంసిద్ధతా అవసరం లేని
ఆనందడోలికల్లో కాళ్ళు
థియేటర్ కాంపౌండులోకి పరుగు తీస్తుండేవి

అప్పుడు సినిమాకు పోవాలంటే
వందల రూపాయలూ అక్కరలేదు
వాహనమూ, బస్సూ
ఏ ప్రణాళికా అవసరం లేదు
అప్పుడు యాక్టర్లు తెర మీద కాదు
సరాసరి కళ్ళ రెటీనాల మీద ఆడేవారు
మనోఫలకాల మీద
నిశ్చల చిత్రాలుగా నిలిచిపోయే వారు

క్యూలో కుస్తీ పడుతున్నప్పటి థ్రిల్
ఆన్‌లైన్ బుకింగంత
అందవిహీనంగా ఉండకపోయేది
ఇప్పుడు యూటర్న్ ప్రయాణాలూ
పార్కింగు పరేషాన్లు తప్ప
నేల నుండి బెంచీకి దూకినప్పటి వీరత్వం లేదు
ఫిక్స్‌డ్ సీట్ రిజర్వేషన్‌తో
అసలే మజా రాదు

ఇప్పుడు సినిమా అంటే
అనేక ఆగచాట్లతో కొనుక్కునే తెరానందం
అప్పటి నిశ్చింతల స్కోప్ సినిమా
నయనానందం
అప్పుడు ప్రపంచం ఇలా
వసుధైక కుటుంబం కాలేదు మరి

*(నవతెలంగాణ, 13 నవంబర్ 2016)*

# తహసిలాఫీసు వైపు

నిద్రాలోకాన్ని అలంకరించడం కోసం
అల్లిపెట్టుకున్న కలల పొగడపూల దండను
ఇంటి గుమ్మానికి వేలాడదీసి
తహసిలాఫీసు తటపటాయింపులకు
బయలుదేరతాను

ప్రయాణపు పదనిసలు
మొదలు కాకుండానే
సెలఫోన్ తరంగాలలో
చిక్కుబడిపోతాను

దరహాసం ముసుగేసుకున్న మంత్రిగారి అధికారం
కంఠస్వరంతో కావలసిన పనిని నిర్దేశిస్తుంది
సౌమ్యత అవసరం లేని కలెక్టర్ ఆజ్ఞ
సంక్షిప్త సందేశంతో బేజారెత్తిస్తుంది
స్వయం ప్రకటిత దర్పాల ఉరుముల్ని
వదిలిపెడుతూ ఒత్తిడి సంఘాలు
హెచ్చరికల్ని విడుదల చేస్తాయి
కురుస్తున్న జడివాన మీద
అదనపు వడగళ్ళ రాయిలా
స్నేహ సంభాషణలు మొదలై
కొన్ని కోర్కెలుగా మొనదేర్తాయి

అవసరాలు, శబ్దాలకు
సంకేతాల్ని పుట్టిస్తాయి
అంతలోనే వాట్సాప్ చిత్రాలకు
నివేదికల నిఖార్సులు కావాలని ఒక బాంబు
ఈమెయిల్ బాణం తగలలేదనే
ఆనందాన్ని తుత్తునియలు చేసే
ఇంకో సెల్ కాల్

ఆఫీసు జోన్‌లో ఎప్పుడూ
హెచ్చరిక లేని తుఫాన్ ఒకటి
తీరం దాటుతూనే ఉంటుంది
లిట్మస్ పేపరు లేని ప్రయోగశాలలో
సంతకం చేయాలో, వద్దో
వేలు విడిచిన ఏ మేనమామా చెప్పడు
ఎలాగూ యుద్ధం తప్పదని
గుర్రం ఎక్కుతానో లేదో
కళ్ళెం ఇంకెవ్వడో లాగుతూ ఉంటాడు
దరఖాస్తు పట్టుకొచ్చిన చందమామలు
వెన్నెల కురవడానికి జంకుతుంటాయి
తురాయిపూల కిరీటం ధరించిన విలేఖరులు
కొంటెగా గిల్లిపోతుంటారు
ఉన్నట్లుండి వాతావరణం
అకస్మాత్తుగా వేడెక్కుతుంది
కిటికీలోంచి వాన
బలప్రదర్శన చేస్తున్నా
ఆఫీసు వేడిలో ఉక్కబోస్తూ
ఏసీని వెక్కిరిస్తూ ఉంటుంది

కోర్టు వర్తమానం దూరవాణిలో
కనిపించని ఉరుముల్ని విడుదల చేసి

కంటెంప్ట్ తూటాల్ని
కసిగా పేలుస్తుంది

ఉన్నట్లుండి ఎమ్మెల్లే
చమత్కారపు లేఖ పంపుతాడు
ఏదైనా సలహా చెబుతామా
భస్మాసురుడి కథలో
సారాన్ని ఔపోసన పట్టినట్లు
దాన్ని మన మనోఫలకం మీదే
ప్రయోగానికి పెడతాడు

సందర్భం ధర్నాల నినాదాన్ని బొమ్మ కడుతుంటే
ఛాంబర్లో సలాముల బూటకాళ్ళ చప్పుడు
రెండు ఫ్లోర్లనూ సాంత్వన పరుస్తుంది.
యాంత్రికమైన సిఫారసులకు
కసిగా రాసే జవాబులుంటై
నిజంగా చేయగలిగే పని
చేతికి పూలహారాన్ని తొడిగిస్తుంది
మొండిపనుల యుద్ధానికి
దండి జవాబుల డాలు సిద్ధమయే ఉంటుంది
కార్యాలయం కదలదు
జనం రాక మానరు
కీలుగుర్రం నర్తిస్తూనే ఉంటుంది
పాత్రధారులుగా మన వేషం
బాగానే నప్పిందని ఎవరో
ముఖస్తుతి చేద్దామని
ఇటే వస్తున్నట్లున్నారు

*(పాలపిట్ట, సెప్టెంబర్-అక్టోబర్ 2016)*

# దండుబాట

గౌజు తెర మీంచి
కదిలిపోయే దృశ్య కావ్యాలు
ఊర్ల పూసలు దండ గుచ్చి
ఊయలలూగే దండుబాట

కుడి ఎడమల
దుబ్బజెల్కల ఎర్ర తివాచీల మీద
పోచంపల్లి అద్దకంలా
వరిమళ్లు

ఆకుల్ని ఆరగించడం మరిచి
పొదల్ని ముద్దాడుతూ
మూటగుట్టల మీద గొర్రెపిల్ల

చౌటుప్పల దాటు!
ఒళ్లంతా అల్లిక పెట్టే
పట్నం ప్రణయ వాయువు

అబ్దుల్లాపురం మెట్టు
పీఠభూమి సింహాసనం మీదికి
సాలభంజికను మెప్పించి వేసిన అడుగు

అప్పుడు దండుబాట
గుట్టలో దాగిన పల్లెల్నీ
ప్రేమల్లో మునిగిన కౌమార్యాన్నీ
లయగాత్రం చేసే ఎగుడు దిగుడు నేల

ఎండల పొగడదండను ఓడిస్తూ
అద్దం సగాల్లోంచి సర్రుమనే కొండగాలి
చెంపల మీద హత్తుకొన్న
చెలిమెల మీద గాటు

సిద్ధాంతం లేదని కవిత్వాన్ని కాలదన్నినట్లు
జాగా లేదని రహదారి
ఊరినే విడిచిపెట్టింది
ఇప్పుడు లేన్లు లేన్లుగా రోడ్డు
పసిరికను మింగేసిన కారు నలుపు తారు

*(ఆంధ్రజ్యోతి, వివిధ, 30 డిసెంబర్ 2013)*

# పిఎస్‌టియు విరి

చెలియలి కట్టను విశ్వసించే
సంస్కారం మీద నిలిచిన ధిక్కారం
ఆత్మ నిర్భీతి నుండి పుట్టిన
నిరంతరం చలన శీలం
సంఘర్షణలోనూ సౌకుమార్యం
స్పందనలోనూ నిఖార్సుతనం

భారతీయతనూ, పడమటి మేలిమికీ చెరిపేసిన హద్దు
స్వేచ్ఛకూ, సంప్రదాయానికీ కుదిరిన దోస్తానం

ఆంధ్రంలోనూ, ఆంగ్లంలోనూ
మాట ఒక మంత్రం
వేదికమీదా స్టూడియోలోనూ
తయారీ అక్కరలేని వక్తృత్వం
ఆమెకున్న సిరి, ఆమె పిఎస్‌టియు విరి
చెప్పని పాఠాలనూ, వినగలిగే ఛాత్రులున్న సారస్వతురాలు
కథనం, విమర్శ అనువాదపు ఆస్తులున్న సిరిమంతురాలు
ఆమె మృణాళిని
నిత్య చైతన్యశీలి

*(డా॥ సి. మృణాళిని గారి పదవీ విరమణ సందర్భం)*

## ఫ్యూచరంతా రాసి పెట్టే ఉంది

నీ ఫ్యూచరంతా
రాసిపెట్టే ఉంది
దాని ఫిల్మ్ అంతా
తీసిపెట్టే ఉంది
ఇప్పుడది బఫర్ అవుతూ
నీకు అగుపించకుండా ఉంది

ఆయన టోల్డ్ స్పీచెస్ కింద
అన్‌టోల్డ్ లెస్సన్స్
స్క్రోల్ అవుతూ ఉన్నై
అవి చదవాలంటే
మొదలు పెద్ద లోకం చదవాలె

నీతుల రెండు నాల్కలను
కవి కనుక్కున్నాడని
వేల గొంతుకల విచ్చుకత్తులు
జనం మీద
విరుచుకు పడుతున్నై

ఆయన జపిస్తే
లోకం జపించాలె

ఆయన తపిస్తే
జగం నటించాలె
ఆయన జనాన్ని లోబర్చుకోవాలనుకుంటాడు
జనం ఆయన్ని వాడుకుంటుంది
ఏమి కావాలో
సరిగ్గా తెలియదు
భ్రమపడతాం కానీ
దొరికింది కోరుకున్నదేనో, కాదో
అర్థం కాదు
సమసిపోయిందేనా
మనం కోరింది!?

*(దర్వాజ, నవతెలంగాణ, 22 మే 2017)*

# రద్దు కాయిదం

అడ్డూ అదుపూ లేని
ఆర్యావర్తపు బాహుబలి
మంత్రాల వల విసిరిండు
ఏ తిమింగలమూ పట్టుబడలే
రోజువారీ బాణాలు గురిపెట్టిండు
ఒక్క పెద్దపులీ రక్తమోడలే
హనుమంతుడనుకున్నాం కానీ
ఏ లంకనూ కాలబెట్టలే
చిటికె వేసి చిదంబర రహస్యాలన్నీ
విప్పబోయిండు
చిత్రంగా
భేతాళుడు మళ్ళీ చెట్టెక్కి కూసుండు

వలనిండా పిల్లచేపలు చిక్కి
విలవిలలాడి
చెరువొడ్డు మీద పడ్డె
బాణాలన్నీ ఊరపిచ్చుకల్ని ఒళ్ళంతా
గాయపరుస్తున్నవి
మాంత్రికుడి చూపు
బుడ్డగోచీ మీద పడ్డది
ఆయన పెట్టిన నిప్పు
మొదలు కింద కాగితాలనే
కాలుస్తున్నది
విప్పని కట్టలు మాత్రం

కొత్త రూపలెత్తుకున్నె
ఎవరూ ఏదీ చెప్పకూడదు
వాక్కుల విన్యాసమంతా ఆయనదే
దేశం అదే
మాతా ఆమే
దేశభక్తికి మాత్రం సరికొత్తగా
నిర్వచనాలు పుట్టుకొచ్చినై

దేశం కోసం ఆయన
విదేశాలు తిర్గుతుండు
మీరొక్క రోజు కూలీ మానరా
రాజ్యం కోసం ఆయన
సరికొత్త తొవ్వలు తొక్కుతుండు
ఒక్కపూట బ్యాంకులో లైను కట్టరా
కనీసావసరంగా ఆయన
లక్షల విలువైన చొక్కా
తొడిగిన నిత్య బ్రహ్మచారి
మీ కులుకుల సంసారాన్ని ఒక్కసారి ఆపేయరా
ఆయనది పేదల పక్షమని చాటేందుకు
ధనిక సమూహ శిబిరాలకు
లీకియ్యకుండానే
మంత్రమేసిండు

మీరు నమ్మరు కానీ
ఫ్రీ జియో సిమ్ రాక
కేవలం కాకతాళీయం
పాత కాగితాల తావుల
అదే స్థాయిలో కట్టలు కట్టలు కొత్తై
రావడం కూడా
మీరన్నట్లూ

జట్టు విరబోసుకు తిరిగే మార్కెట్టు
ఇప్పుడు గుండు గొరిగించుకున్నట్లుంది
సన్నివేశానికి సంబంధం లేని
ఎటీఎంలు విదూషకుడిలా వికటాట్టహాసం
చేస్తున్నాయి
మంత్రం బాగానే చదివిందు గాని
ఊరవతల చెట్లకు ఆయన వేసిన గారడీ ముడి
ఊడిపోయినట్లుంది

*(8-11-2016న నోట్ల రద్దు)*

*(నమస్తే తెలంగాణ, చెలిమె, 03 ఏప్రిల్ 2017)*

# లోహ విహంగం

కవులలో పాండిత్యాన్ని
కొలత తీయాలనుకున్న
బహు చిన్నవాళ్ళదీ లోకం
పరీక్షల్లో ఫెయిలై
జీవితంలో డిస్టింక్షనొచ్చినోళ్ళు
ఈ దారెంట జులూస్ తీస్తారు

మూలమలుపుల కడ
ఎవరికీ కనిపించకుండా నిలబడి
దు:ఖించడమొక్కటే కాదు
నలుగురు కూచొని నవ్వే వేళల
ఒడుపుగా తప్పించడానికి
ప్రయత్నించే అసహాయతకు
స్నేహం ముసుగేసినప్పటి
గాయం గుర్తే ఉంది

రెక్కలు విరిగితే
పక్షితనమేముంటుంది
ఆయుధం లేని వీరత్వం
ఎంత ముందుకు పోతుంది

ఒకపూట అన్నం దొరకని రోజులుండొచ్చు
కొన్ని వారాలు మంచం వీడని జబ్బులుండొచ్చు
యేటి ఒడ్డన పరుగెత్తినప్పుడు
తుమ్మ ముండ్ల గాయముండొచ్చు
ఎప్పుడూ ఈదిన చెరువులోనే
సరికొత్తగా నాచు
కాళ్ళను కట్టేయవచ్చు

నదిపోకడ తెలియని పోరగాళ్ళు
ఎదురీదీ ఎదురీదీ
ఒక నిజం కనుక్కుంటరు
నావ వెళ్ళిపోయింది అదే నదిలో
మొదటి ప్రయాణికుడిని వదిలి
వెళ్ళిపోయిన లోహ విహంగంలా

*(వంతెన, కవిత్వ బులిటెన్-1)*

# ఇలలోని రూపం

ఎప్పుడు విత్తితే
అప్పుడు మొలుస్తై
ఎక్కడ నాటితే
అక్కడ నిలుస్తై
ఎండల్ని నెత్తికెత్తుకొని
నీడల్ని జారవిడుస్తై

శాసించినంతనే
సాగిలపడ్డట్లు
వరుసలో నాటితే
ప్రాణమున్న కోటగోడలైతై

గొడ్డలి వేట్లూ
రంపపుకోతలూ సహిస్తూ
కన్నీరు కనిపించకుండా దు:ఖిస్తై

ఛాయామాత్రులు
ఫలదాయినులు
పుష్పకీర్తులు
ఇక అవతారం
చాలించుకుంటా
మనుకుంటున్నాయి

సురలోకం చేరాలని
సంకల్పం కట్టుకుంటున్నాయి
మనం కోరకపోతే
మారకపోతే
దేవతలంతా
చెట్ల అవతారం
చాలించుకుంటారు

*(ఆకుపచ్చని పొద్దుపొడుపు కవితా సంకలనం)*

# అదే ఊరు

లయాత్మకంగా నాట్యం చేసే
మబ్బుల సొగసుల గురించి అన్నారో
గట్టుకు కిరీటం బెట్టిన
సింగిడి గురించి విన్నారో
చెప్పలేదు
ఇసుకకు రూపం ఇచ్చిన
గూళ్ళను తలచారో
ఆటకు మైదానం పరచిన
మనసును పిలిచారో
నిర్వచించరాని గజిబిజిలో
ధ్యానానికి కూర్చొమ్మంటరు
అప్పుడు విడిచిన
కాయితప్పడవల మీద
ఇప్పుడు పయనం కమ్మంటరు
వాళ్ళున్నారో లేదో
నేత్రాలకు నాట్యం పొడగట్టింది
నడిస్తేనే అలిసిపోయే రోజుల్లో
ఎంత గెంతినా ఒడువని
కేరింతల కాలం గుర్తొచ్చింది
మనుషులంతా ఒకలా ఉన్నట్లు
ఊర్లన్నీ ఒకలాగే ఉంటై
అప్పటి మనుషుల ప్రేమల్లా

చెరువుల్లోనూ
దిగుడుబావుల్లోనూ జలం
సమస్త జీవజాలానికి
అందివచ్చినట్లుండేవి
నీళ్ళకు లేబిళ్ళు లేకుండేది
ఊరు తల్లివేరు
అది పైసలతో కాదు
మమతలతో జీవించేది

అప్పుడెగరేసిన గాలిపటం
తెగిన దారాన్ని మోసుకెళ్తూ
మళ్ళా భూమి దిక్కు చూడలేదు
గోనెతో సర్చుకున్న బుర్రు
ఇన్నేళ్ళయినా
నేల మీద పడనే లేదు
కాలువలో సెల్ఫీ దిగిన
చందమామ ఇంకా
మురిపాల జ్ఞాపికలు
ఒలకబోస్తూనే ఉంది
కాలు విరగడానికంటే ముందే
క్లాసు రూంలో
మనసు విరిగిందన్న సంగతి
తుంటరి ప్రేమ లేఖలు
గుర్తు చేస్తుంటై

ఆకలికి అందం దిద్దిన రోజు
స్నేహానికి మొదలు పెట్టిన
ఫినిషింగ్ టచ్
ఇంకా పూర్తయిత లేదు

జీవితం
కవిత్వాన్ని వెంటాడుతున్నట్లు
తెలుసు కానీ
దీనికిన్ని ఫిట్టింగులు
బిగించాల్సి వస్తుందని తెలిస్తే
పదో తరగతిలోనే
పదే పదే ఫేలవుతూ ఉండిపోయేవాన్ని
జీవితపు పడవని
ఊరి ఒడ్డు మీదే
లంగరేసి ఉండేవాడిని
ఇంత దూరమూ ఈదానన్న
ఆనందాన్ని తుత్తునియలు చేస్తూ
ఇది మధుమేహం గడ్డ మీద
మెరకెక్కింది
నా ఊరైనా ఇప్పుడు
నన్ను సాంత్వన పరుస్తుందా

# ఏదో ఒక ఉగాదిన

రవీంద్రభారతిలో
కురుస్తున్న మంచుబిందువుల్లా
గేయాలకు స్వరకల్పన
జరుగుతూ ఉంటుంది
ఆకాశవాణి తరంగ దైర్ఘ్యం మీద
కవితా వాక్యాలు ప్రవహిస్తుంటాయి
ప్రెస్‌క్లబ్‌లో కులవివక్ష వాదాలు
గండశిలల్లా స్థిరపడిపోతాయి
కళకూ, సారస్వతానికీ
లంకెపెట్టి చోద్యం చూస్తుంది
తెలుగు యూనివర్సిటీ
దాచిదాచి
భద్రపరుచున్న సర్టిఫికెట్లన్నీ
అక్కర తీరి వాననీటిలో
ఆటపడవలైపోతాయి
ఏదో ఒక ఉగాదిన
మనముండం

జిల్లా కేంద్రాల్లో కవిసమ్మేళనాలు
ఉస్సూరమంటుంటాయి
సారస్వతపరిషత్తులో
పాతపుస్తకాలు అమ్ముకుంటుంటారు

తుమ్మచెట్లకు గులాబీలు పూసినట్లు
ఫుట్‌పాత్ మీద
తిలక్ పుస్తకం దొరుకుతుంది
భాషా నిలయంలో కృష్ణరాయలు
అభినవ ఆముక్తమాల్యద రాస్తుంటాడు
త్యాగరాయగానసభలో
నృత్యరూపకం సిటీ లైబ్రరీలో
పుస్తకంలా అచ్చవుతుంది
కళాసుబ్బారావు వేదికలో
పదిమందే వేల హృదయాలతో
పులకిస్తుంటారు
పండగా పబ్బాల్నీ లెక్కపెట్టకుండా
అక్షరాల వాన కురుస్తుంది
వెలుస్తుందని గ్యారంటీ లేదు
నిజంగానే
ఏదో ఒక ఉగాదిన
మనముండం

మేధావులంతా
విజ్ఞాన కేంద్రం హాళ్లలో చిక్కుబడి
ఆవిష్కరణసభల్లో
ఉక్కిరిబిక్కిరవుతుంటారు
వాన గట్టిగా జాడిస్తే
చెట్లు విలవిలాడినట్లు
ఊహలకు రెక్కలొచ్చి
కొత్త కావ్యాల సృష్టి
జరుగుతూనే ఉంటుంది

నగరానికి చిత్రపరిశ్రమలా
సాహిత్యం శివార్ల

పార్కుల్లోకి ప్రవహిస్తుంది
హాళ్ళన్నీ నిండిపోతై
నిర్వాహకులు సభల్లో
జనాన్ని కలగంటుంటారు
ప్రతి ఉగాదికీ
కొత్తగా రాస్తూనే ఉంటారు
కవిసమ్మేళనమో, కొత్త యేడో
వసంతాన్ని లాక్కొస్తూ ఉంటాయి
నిజం
ప్రతి ఉగాదిన
అంతా ఉంటుంది
ఏదో ఒక ఉగాదిన
మనముండం

# అతడు, బోరు, పాప

గుంత
ఒక కేంద్రం.
లోపలా, బయటా
దు:ఖమే

బిడ్డ నాగవెల్లిఇన కుదవబెట్టి
దాన్ని తవ్వినప్పుడు
లేసిన దుమ్ముకు
అతని గుండె పెద్దదనుకుంద్రు
కొడుకు పుస్తకం
మూసిన రఖంతో
జలను దోలాడితే
అది రాకాసి నోరు దెరిసింది

పచ్చదనం మీద
పిచ్చివట్టిన అతడు
జలతపస్సు చేసినట్టు
కలలోకొచ్చిన
భేతాళుడి అప్పు మీద
మరొక బోరుబొమ్మను గీసుకుండు
తాపసి గమ్యం చేర్చే
ఏ శివుడూ రాలే
పురుగు మందు
గొంతు తడిపినప్పుడో

ఉరితాడు
ఊయలలూపినప్పుడో
లోకం
విషాదమైతే నటించింది కానీ
అప్పుడు బోర్లలోలానే
ఎవరి కళ్ళల్లోనూ
నీరూరలే.
అతడుత్త రైతు
అందరి నోళ్ళల్లోనూ
ఉంటాడు కానీ
ఎవరి హృదయం లోకీ
చేరలేదు

***

గుంతలో పడ్డ పాప
ఇంకెంతకూ నవ్వదని
కనీసం ఇప్పుడైనా
లోకం కండ్లు
జలపాతాలైనై

***

కంట పొంగిన గుండె ప్రశ్నలు
ఎవర్నైనా కదిలిస్తాయా
'భూమికి గాయం కాని రోజెక్కడ
నాగలికి న్యాయం జరిగే
గడియ ఎప్పుడు
పాపల ప్రాణం జారని
విధం ఎట్టిది'

*(దక్కన్‌లాండ్ మాసపత్రిక, అక్టోబర్ 2017)*

# తొలిపరిచయం

ఏదీ మిగలదని తెలిసీ
ఏదో మిగిలించుకుందామని
ఒక్కచోట కాలు నిలువకుండా
నడయాడే నది మనిషి
***

నటన మరుపు
అస్సలు రక్తి కట్టదు
***

మరిచిపోవడం
ఇప్పటి మీ అవసరం
జ్ఞాపకం జీవమున్నది కదా!
పదేపదే ఎదురొస్తూ
నటన ఆవశ్యకతను
నేర్పిస్తున్నట్లున్నది
మీరు
సహేతుకంగానే మర్చిపోయినట్లు
ఆశ్చర్యపడుతుంటారు
ఇక్కడేవీ కలుపుమొక్కలు లేవని
నీ అంతరాత్మ బోధిస్తుంది
మీ ఏకాంతరాత్మ కూడా,
అవసరాలు మిక్కుటమై
ఆడిన మాటలు

అసలే అందకుండా
వేదిక లెక్కి కూచుంటై
ఎగిరిన జెండాలు
అవనతమైతై
దూరవాణి లోని ఆత్మీయతలు
ఎదురుపడ్డప్పుడు
నిష్కారణంగా పగలబడుతై
మనుషులను నమ్మొద్దని
ఎప్పుడో చెప్పినట్లున్నావ్
అతి తెలివైన వాళ్ళను మాత్రం
అస్సలు నమ్మొద్దని
నానుడి కావలసి ఉంది

# పగలే చీకటి

సంధ్యలో దీపం వెలిగింది
ప్రవాహం మలుపులో
ఒక ద్వీపం వెలిసింది
వీచే గాలిలో
వింత పరిమళం కలిసింది
కాలం కాలు నిలిపి చూసింది
పజ్జెం గజ్జె గట్టి ఆడినపుడు
విశ్వరంగస్థలం విస్తుబోయింది
గళం సర్వరపరిస్తే
గమకం పద్యమయింది
కావ్యాహార్యం వేసుకున్న
పాటకన్య
పదహారు కళల్ని
ప్రదర్శనకు పెట్టింది
పగలే వెన్నెల పరిచి
పదం పరాచికాలాడింది

***

పూలకు పరిమళమున్నట్లే
నేలకు కొన్ని జ్ఞాపకాలుంటాై
విశ్వంభర ప్రస్థాన వార్త
తెలుగు వాకిళ్ళను దాటి
హృదయ కవాటాలను తగిలినప్పుడు
ఆకాశం బిత్తరపోయింది
భూలోకం గుక్కపట్టింది
ఇప్పుడు పగలే చీకటి

*(కవిసంధ్య బులిటెన్-8)*

## కలల పథం

మబ్బులు కోతి మూకలై
కాస్త ఆటాడి జావగారిపోతై
నువ్వే, పరాచికాలాడి
పైరగాలిని రెండుగా
విడగొట్టుకుంటూ పోతౌ
మేమే లెక్క చేయని దక్కన్ ఎండని
నువ్వు జుట్టుకు ముడేసుకొని జాడిస్తౌ
ఆటలో ప్రయాణానివో
ప్రయాణంలో పసందాటవో
నువ్వీ భాగ్యనగరపు మెరుపు కలవు

పక్క పక్క సీట్లు దొరకని
ప్రేమికుల గుండెల్ని
ఒక్కచోటనే కూర్చోబెడతవ్
సోషల్ మీడియాలో
దొరకని దోస్తానా
ఏదో ఒక బాక్సులో
ఎదురు పడేస్తవ్
స్వల్పయానంలో వికసించిన స్నేహమే
సుదీర్ఘ ప్రయాణానికి
సూచికలు తయారు చేస్తుందిక్కడ

ప్రయాణానికి పరమార్థం రాస్తున్న
కావ్యంలా నీ నడక,
ఆకాశంలో నడిచే
ఇంద్ర ధనుస్సువై నువ్వు పారాడుతుంటే
ప్రతి రేయీ దీపావళి నాటి
చిచ్చుబుడ్డిలా వెలిగిపోతుంది
తొలి సంధ్య కూతలో నీ నడక
సామాన్యుడికి పాడే
సుప్రభాతమవుతుంది.
ఆహ్లాదంగా రంగులద్ది
సాయంకాలాన్ని మోసుకొస్తుంటే
తల్లుల రాకల్ని పసిగట్టిన
పసిపిల్లల కేరింతలా
నీ హారన్

చందమామను కిందికి దింపిన
చార్మినార్ తలమానికమే
శతాబ్దాల వెలుగు పంచిన
కుతుబ్ నిషానీ
గుండె పొంగులే
రాతి కట్టడాలు
రాచ నివాళులూ
షహర్ శిరసు మీద
నిత్య కీర్తుల మకుటాలే

నువ్వు కదిలే యంత్రానివి
సామాన్యుల్ని కదిలించే మంత్రానివి
నగరమాత
ఒంటినిండా పరిచిన
వాడిపోని పూల హారానివి

శతాబ్దాలుగా నిలువనున్న
చెక్కుచెదరని కలవి
సామాన్యుడి శ్రమలా
కలకాలపు మాన్యుమెంటువి
నింగిలో బాటలు పరిచిన
నియమిత గమనానివి
నిన్ను ఉత్త మెట్రో రైలంటే ఒప్పుకోను
సామాన్యుల
కలల రథానివి
కలకాలం
నిలిచే పథానివి

*(నమస్తే తెలంగాణ డైలీ, 02 అక్టోబర్ 2017)*

# అయ్యో! కవీ

గుండె మీద
గీతల్వడితె
కాయిదం మీదికెక్కిస్తడు
సంఘటనల్ని జూడకుండ
సారాన్ని వెతుక్కుంటడు
దృశ్యాల వెనకాల
అంతర్లీనపు చోదకశక్తుల్ని వెంటాడ్తడు
నీళ్ళు పడ్తై
పోతై
తామరాకు లెక్క
ఉండమంటడు

రోజూ రోజూ ఏడ్చే లోకంల
క్షణం క్షణం నగిపిస్తడు
పెదవుల మీద మురిపియ్యడు
కలేజా మీద గిలివెడ్తడు
ఉన్న తావున ఉండకుండా
ఎండ్లనో మున్గిపోతడు
జగత్తతంతా గలగలమంటే
అది శాశ్వతం కావాలని
ప్రణాళిక గీస్తుంటడు

*(నవతెలంగాణ, 12-2-2018)*

# మలుపుల దగ్గరి దుఃఖం

నేనా తొవ్వలో
నడుస్తున్నాను
పూలు కాదు
అక్కడన్నీ ముళ్ళుంటయ్
తాకుడు రాళ్ళుంటయ్
మీద పడితే
మనం మళ్ళీ లేవలేని
గుండ్లుంటయ్
మొదట నిచ్చెన్లు
బాగనే ఎగరేస్తయి గని
పరమ పదం
చాలా దూరమెళ్ళి పోతుంది
పాములు మింగడానికి
నోళ్ళు తెరుచుకొని
కాచుకుంటయ్

బయట నుండి
అంతా మెరుపుల్ని చూస్తరు
ఎండమావులు
వాళ్ళకందవు
శిఖరాల్ని మోహిస్తరు
పునాదులు
ఎవరికీ తెలియవు.
అయినా
సహృదయుల్లో
సందేహాలుంటయ్

ఒక్క అబద్ధమైనా
చెప్పలేని వాడివి
అక్కడెలా నెగుల్తున్నావంటరు
ఒక్కసారైనా
మాట తప్పని వాడివి
ఈ మాటలన్నీ
ఎలా నిలబెట్టుకుంటావంటరు

నడుస్తున్న తొవ్వ
కోరుకున్నది కాదు
మలుపుల దగ్గరి దు:ఖం
దింపుకోవడం
గుండెకోతే

శరీరం మీద దాని
దాడి కనిపిస్తది
మనోశకలం మీద
దాని నాడి
స్వారీ చేస్తది

మనమెక్కడున్నామో
మన చేతుల్లో లేనట్లే
మనమెక్కడుంటే
అక్కడి వేదికల మీదే
నాట్యమాడాలె

మనకో మనసుంటది
తన దారిలోనే అది
మనల్ని నడిపిస్తది

*(మూసీ మాసపత్రిక, అక్టోబర్ 2017)*

# తోటలోకి అడుగెయ్యాలె

ఎలుగు బంటి మీద
ఎగిరి దుంకిన
గాయాలైతే ఐనైగని
దాన్ని పడుకోబెట్టిన
పెద్దపులితో
కుస్తీబట్టిన
ప్రాణం పోయి వచ్చింది గని
పులి సలాం గొట్టింది
పిట్టల్తో ఆడుకుంది నిజమే
పిల్లల్తో పెద్దరికాన్ని
మరిచిపోయిందీ నిజమే

కాటేసే పాముల నడుమ
పాషాణంలా నిలబడ్డా
గేలి చేసే కోతి మూకల మధ్య
చేతుల్ని జెండాల్ని చేసి
కలెబడ్డా
మలుపు మలుపు దగ్గర
గాయపడ్డా

మజిలీకి మజిలీకి
కవిత్వమై రాయబడ్డా
లోకం ఏ పనిని
ఎలా కొలత తీస్తుందో
ఎంత మోతకు
ఎన్ని యూనిట్లంటారో.
పెద్దాఫీసుల
ఇనుప చట్రాలేసుకొని
మకాం పెట్టలేదు
అంతా పునాదుల్లో
రాళ్ళు పేర్చాను
సామాన్యులకు
పూలు పంచాను
కుదుమిస్తే
పండుగ చేసాను

నన్ను నన్చని
మాన్యులుండవచ్చు
మెచ్చని
సామాన్యులైతే ఉండరు
మీదేసుకోవడమే గాని
తోసెయ్యడం ఎరగనోన్ని
భుజాలకెత్తుకోవడమే
గుర్తుంది కాని
కాడెత్తేసే తత్వం లేదు
ఏది అంటానో
అదే చేస్తానని
కొందరికి కంటగింపు
ఏ సెక్ట్‌లో కలవనని
ఏ గుంపులో కూడనని

పరిహాసమో
గౌరవమో
ప్రకటిస్తుంటారు
ఇకనైనా
కంచెకు ఇవతల కాలు పడాలె
బె(రకు ఇటువైపు దుంకెయ్యాలె
కోట నుండి కాస్త
తోటలోకి
అడుగెయ్యాలె

*(దక్కన్‌లాండ్ మాసపత్రిక, జనవరి 2018)*

# తెలుగు పూలు

పగిలిన అద్దంలో
చిన్నబోయిన అమ్మ మొఖం
వట్టిపోయిన నది మీద దిగాలు వంతెన
కాంక్రీటు జంగల్ మీద
భయం భయంగా
ద్రవిస్తున్న నింగి
గ్లోబల్ ఖడ్గం నరుక్కొస్తుంటే
కంఠాలర్పిస్తున్న బలహీన భారతుల
దృశ్యం మీదుగా
ఒక చిరురక్షణ కవచం పరుచుకుంటోంది
కలలు ఛిద్రమైన చోటా
పూలమొక్కలు మోసులెత్తుతై
నేల నెర్రెలు వారిన చోటా
జలదృశ్యం ఊపిరిపోసుకుంటుంది
భావనలుంటే కదా
భాషగా బయటకొచ్చేది
పలుకుంటే కదా
పరిణత వాక్యమొచ్చేది
కాలానికి నిలిచిన
రాజ్యానికి పుట్టిన
భావానికి పూచిన పూలు
కలకాలం నిలుచుండాలి
మట్టి మనసుల్లో శోభించాలి

*(నేటినిజం, ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, 2017)*

# ఆట గుర్రం

పగలంతా ఎండ కాస్తది
రేయి నిండా వెన్నెల కురుస్తది
ఫ్యాను కింద ఓ నౌకరీ సేదదీర్తది
సెలవుకూ సెలవుకూ నడుమ కొందరు
ఓ హెచ్‌ల బ్రిడ్జ్ కట్టుకుంటరు
ఊరందరిదీ ఒకటైతే
జమాబందీ ఉలిపికట్టెదొక దారి
చెయ్యాల్సినదేదీ చెయ్యకుండానే
ఓవర్‌టైంలు రుబ్బుకుంటరు
ట్రెడ్‌మిల్ మీది పరుగు
కొయ్యగుర్రం ఉన్నచోటునే
పరుగెత్తీ పరుగెత్తీ అలసిపోతది
అందుకే
శాఖకూ ప్రజకూ నడుమ
ఎడతెగనని నెగడు
రెండువైపులా సెగ
కాలో చెయ్యో తరచూ
కాలుతనే ఉంటది
బహిరంగపు పంచనామా
రహస్యంలా దాచుకుంటుంటది

# 1/2 చాయ్

ఇరానీ హోటల్
కక్కయ్యేది
ఎంత పెద్ద చెయ్యి
కప్పుల చాయ్ వోస్తే
సాసర్ల ఒలికిపోయేది
***
ఊర్నుంచొస్తే
ఊరికి వోయిందాక
ఖాళీ కడుపు నిండా
గప్ చిప్‌ల నీళ్ళే
***
ఎర్రటెండల గూడ
చలివేంద్రంల
రెండు గ్లాసుల
సల్లటి నీళ్ళు దాగితే కొడ్కా
దూప గాదు
ఆకలిగూడ దీరేది
***
దిల్‌సుఖ్ నగర్‌ల
లారెక్కితే
పది రూపాయలకే చిట్యాల

చార్జి తక్కువ
స్పీడెక్కువ
***

ముగ్గురం
చాయ్‌కి వోతే
రెండు గావాలె
బెస్ట్ ఇంకోన్ని పిల్చుక వో
చాయ్ 2/4
వాడూ సాటిస్‌ఫై
***

ఇద్దరం కలిసే
డబుల్ డెక్కర్
బస్సెక్కినం
కండక్టర్ నన్ను
పైకెళ్ళమంటె
ఆమె కుతకుత
ఉడికి పోయింది

# ఒక నిజం తెలిసింది

చరిత్రను కాస్త
దొర్లించి చూడండి
పుటల్లోని అక్షరాల
అంతరంగాలకు పుటం బెట్టండి
అన్ని దత్తాంశాలూ సేకరించి
సాధించాల్సిన ఉపపత్తిని
సొంతం
అటకెక్కించింర్రు

తూర్పు నుండి
కమ్యూనిస్టులు
తూకం వేసింది వేరే
చెరసాలల్లో నమోదుకు
తహతహలాడిన
స్టేట్ కాంగ్రెస్ సేఫ్‌గేమ్‌లో
స్కోరంతా వేరే
తుపాకుల కూర్పుడాటలో
సెల్ఫ్ గోల్ కొట్టుకున్న
రజ్వీ పిచ్చికి
మూలమంతా వేరే

నెలవంకల ఉగ్రతూటాల
మొగ్గలను
హస్తినలో ఊహించింది
ఎంత నిజమో
లాంగ్‌మార్చ్ అరుణిమలు
కేతనమైతే

భారతం భంగపడిపోతదన్న
దేశీయ భక్తి కుట్రా
అంతే నిజం
సైన్యం
చక్కని దక్కన్ కోసం కాదు
హస్తిన విస్తరణ కోసం
ఒక్క దెబ్బకు రెండుపిట్టలు
ఒరిగింది నిజం

ఉలుగ్‌ఖాన్
తుగ్లకై
దేవగిరికి తరలినప్పుడు
ఔరంగజేబు
దశాబ్దం పోరాడి
గోల్కొండను కొట్టినప్పుడు
బహు కొద్దికాలమే
ఇక్కడ ఢిల్లీ లొల్లి నడిచింది

విలీనమైనా
విముక్తమైనా
విద్రోహమైనా
ఇంత విస్పష్టంగా
దక్కన్ / ఢిల్లీకి
చిక్కింది ఇప్పుడే
సంస్థానాలు సమాప్తమై
మూడు ముక్కల
రెండు దేశాలు
పుట్టినప్పుడే

*(దక్కన్‌లాండ్, ఏప్రిల్ 2018)*

# తెల్లారగట్ల కల

సాయంకాలపు నీరెండలో
గునుగు పూల వనంలో
ఎవరో కత్తులు తిప్పుతున్నట్లు

చందమామను కిందికి దింపి
వెన్నెల సముద్రాల్ని
కబ్జా చేస్తున్నట్లు

అడవి పక్షుల మెడలకు
ఉచ్చులు బిగించి
ఒడుపు చూసి
తాడు లాగుతున్నట్లు

పిల్లతొవ్వల
బంతి పువ్వుల్ని చిదిమేసి
దండు బాటల మీద
సరుకు రవాణా
కవాతు నడుపుతున్నట్లు

మోట బావులన్నీ
బహుళ అంతస్తుల

సోయగాల్ని చూసి
మెడలు విరిగేలా
విస్తుబోతున్నట్లు

తెల్లారగట్ల కలబడింది

రాళ్ళకు కొట్టిన
పిడకల్లాంటి మరకల కల

వసుధైక కుటుంబం
ఏక ధృవ ప్రపంచానికి
సాగిల పడుతున్న
అనూహ్య స్వప్నం.
నిత్యం శిలలు రాలిపడుతున్న
బురుజు లాంటి కలత కల
పురాజననాల
పునాదులను ముంచేస్తూ
నగరం వదిలే విసర్జన నదిలా విస్తరిస్తది

పీడ కల
నిజం కాకుండా చూడాలె
పీడితుల స్వప్నం
తప్పిపోకుండ చూడాలె

*(నవతెలంగాణ, 9.4.2018)*

# డ్రెస్ రిహార్సల్

ఎవరు ఎందాక వచ్చినా
ఆ గేటు దాటి రారు
ఎవరు ఎన్ని బాధల్ని పంచుకున్నా
నువ్వు తెచ్చుకున్న లగేజీ
నువ్వొక్కడివే మోయాలి
పాప పుణ్యాల లెక్కలు తేలుతున్నట్లు
చెకిన్‌లో బిక్కుబిక్కుమంటూ
ఒక్కడివే ఎదుర్కోవాలి
భౌతికంగా ఇక్కడ
వాళ్ళు నీ దాపరికాల్ని వెతుకుతున్నప్పుడు
అంతరంగాన్ని మర్లించి మర్లించి
నువ్వే శోధన చేసుకోవాలె
అన్నీ అమర్చినట్లుండే
బహుదారుల కూడలిలో
నీ దారెటో నువ్వే వెతుక్కోవాలె
సీటు సిద్ధపరచుకొని వచ్చినా
రాతలో కూర్చోవడం పూర్తయే దాకా
ఎడతెగని ఆందోళన
ఆగబట్టుకోవాలె

తీరా విమానమై పైకెగురతమా
మట్టితో నిండిన నేలనేకాక
ఇంకేదో కోల్పోయినట్లుంటది
సమూహంలో ప్రయాణిస్తూ
ఏకంత లోకాల్లో
చిక్కుబడి పోయినట్లుంటది
నిజయానం చేసినప్పుడు
ఈ నలుగురూ రారని
ఎవరో మనల్ని
డ్రెస్ రిహార్సల్‌కు తోలినట్లుంటది
మనం పలికిన నాలుగు మాటలు
ఎవరైనా ప్రేమతో పలికేట్లు
చేసుకోవాలనిపిస్తది
ఎప్పుడు పిలిస్తే అప్పుడు
సిద్ధమయే ఉండాలనిపిస్తది

# పోగొట్టుకొన్న చోటు

పోగొట్టుకొన్న చోటేదో
వెతుక్కుంటూ కన్నీటి దిబ్బను చేరుకున్నాక
స్వర్గానికేసిన నిచ్చెన ఇటుకొసకు
మన ప్రేమ రక్తమోడుతున్న సంగతి
సూర్యుడు అవసాన ప్రేయసిని
ముద్దాడుతూ కానీ చెప్పలేదు
అనుభవం ఆలస్యమయిందని
వాగ్దాన భంగం మొదలవుతుంది
నటనల మధ్య నివాసం
నీరుగారి పోతున్న వేళ
గాయం లేదన్న మాటే కాని
ఇది యుద్ధమే
బయటికి కనిపించదు కాని
ఆయుధం పదునైనదే
నోళ్ళు నవ్వుతుంటాయి కాని
నొసళ్ళు కనిపించవు
గుండెను లాకర్లలో దాపెట్టుకొని
అంతా అస్త్రవిన్యాసంలో
ఆరితేరుతుంటారు
పాత్రాన్ని నేలమాళిగల్లో పాతరేసి
వేదికల మీద నాట్యం
పండిస్తుంటరు

ప్రపంచమంతా కలయదిరిగి వచ్చి
మునివాకిట్లో దారితప్పుతం
శత్రువుకు రాసిన ప్రేమలేఖ
నలుమూలలూ తిరిగి
పదే పదే మారే జెండా రంగులా
పట్టపగలు కౌగిలిస్తుంది

మనమిక నవ్వలేం
మురిపాల మాత్రలెన్ని వేసుకున్నా
అంతరంగ రుజాగ్రస్థత
వెంటాడుతూనే ఉంటుంది
శతాబ్దాల కిందట పాతిన
దుఃఖపు వృక్షాలు
కొద్దికొద్దిగా ఫలిస్తున్నాయి
పూలను చూసి మురిసి
యుద్ధాలు చేసిన లూతలు
తెగిన తలల మీద
గడ్డకట్టిన ప్రాణాంతర వేదనకు బదులు
కటారుల్ని భద్రపరిచి బహూకరించారు
మనం కచ్చితంగా
కత్తిని ముద్దాడుతం
పూలు దొరికినా
పరవశపు గాలులు ఎదురొచ్చినా
పర్వవేళా తరంగాలు కన్నుగీటినా
కత్తులకు పదునుపెట్టి
కన్నీటికి ఊటచేసి
నిరంతర యుద్ధరంగంలో
నిస్సిగ్గుగా చిందులేస్తుంటం

*(నమస్తే తెలంగాణ-2.4.2018)*

# మూల మలుపు

ఒంటి మీద
మచ్చ వచ్చిందంటే
అంతరంగాన్ని తరచి
చూసుకొమ్మంటరు
పావురం పాట
లయతప్పుతుందంటే
నదీతీరం కలుషితమయిందేమో
కనుక్కొమ్మంటరు

అన్ని టెస్టులూ
చేయించుకోవాలట

ఎంతో యుద్ధం నడిచిన
కారుణ్య భూమికదా
అన్నీ లక్షణమేననే
అభివ్యక్తి వస్తుందా
ఏడతెగని తొక్కిసలాటల
పంట పొలం కదా
చేను కుదురుగానే
నిలబడి ఉంటుందా
వంకర టింకర దారుల్లో

పడుతూ లేస్తూ తీసిన పరుగుల్లో
విరిగిన ముళ్ళ
ఆనవాళ్ళ ఆనెలుంటాయేమో
ఎవరికి వారై పరుగెత్తే
వింత వేగంలో
లోకం చింత చేసినోల్ల
కాయమసలు
కందిపోకుండా ఉంటుందా
ఇంటి గురించీ
వంటి గురించీ కాకుండా
ఇంకేదో
వెన్నెల లోకం వెదికినందుకు
చీకటి ముసుగు మీద
వెలుగు రేఖ విరబూస్తుందా

టెస్టులన్నీ
పూర్తై
ధృవపత్రం తయారీలో ఉన్నప్పుడు
ఒక వింత తెల్లగొంగడి లాంటి
భయంభూతం
ఒల్లంతా అల్లుకుపోయినట్లు
కొట్టం దారి మరిచిన లేగదూడ
వెతుకులాడుకొని
కూలిన దొడ్డికి చేరుకొని
దిమ్మెరపోయినట్లు
పత్తిపూల వనంలో పరవశిస్తూ
పురుగు మందుకు
ఊపిరి తిత్తుల్ని తెరిచిపెట్టినట్లు
దడ

పర్వతాల నధిరోహించి
జారుడు బండ మీంచి
జారిపోతమా
మహానదుల్ని
ఈదుకొనివచ్చి
పిల్లకాలువలో
చిక్కుబడుతమా

మూలమలుపులో
తొవ్వకనబడదు

మలుపు దాటాలె
తొవ్వ ఎట్లున్నా
ప్రయాణం సాగించాలె

# పులి సంచారం

అర్థ బ్రహ్మచర్యం అట్టిపెట్టుకున్న పులి
అదృశ్య కూనల్ని కన్నది
నల్లకోట్ల మురికిలో
తక్కెడ బాట్ల అడుగుల్లో
పాసంగాల్లా
పరిశోధన వ్యవస్థల
మస్తిష్కాల్లో ప్రభావశాలుల్లా
పులికూనలు పాగావేసాయి
అన్ని తుదితీర్పుల
అంతిమ వ్యాక్యాలు
పులికూనలే రాస్తున్నాయి

గోవుల్ని ప్రేమించే పులి
పసి బాలికల్ని కామించే మూకల
మాతృ భక్తికి
మోజు పడుతుంది
దేవుడు జీవుల్నికోరే వ్యవస్థ
ప్రతీకలు కదా
ప్రాణం కన్నా శీలం
కీర్తించబడే దేశంలో

ఆసిఫాను దళిత ద్రౌపదిని చేసి
పగలబడుతుంటే
వ్యవస్థంతా పులి ముట్టించిన
వెలుగులోనే వికృత నృత్యమాడుతుంది

రాజుల రచ్చకే
గజగజలాడిన లోకం
యోగులకు పాలన అప్పగించి
విలవిలలాడుతుంది
మానవులంతా ఒక్కటేననే
వసుధైక కుటుంబం
ఇంకోరకం మానవులసలే
ఉండొద్దంటది
ధర్మమార్పిడితో తలెత్తుకోవడం
మహానేరమంటుంది

ధైన్యానికి ప్రతి రూపాల
కన్నీరుతుడవకుండా
సర్వాంతర్యామిని
మంటపం నాలుగ్గోడల నడుమ
బంధించే వారి భుజంతట్టే పులి
ఊయలలో కలవరపడే
మొగ్గల స్వప్న సీమల్లో
విహారాన్ని నిలవేసి
వెలుగు దివ్వెను
గర్భగుడుల్లో దాపెట్టిన పులి
మహా స్వాముల
అంతరిక రహస్యాలకి
అడ్డుగోడ కడుతుంది

పులి
గోవులకనికరపు గొంగడి కప్పుకొని
మనుషుల్ని వెంటాడుతుంది
మనుషులంతా
ఒక్కటి కావాలె
పులిని బోనులో పెట్టాలె

# పారా హుషార్

ఇక్కడ నిలబడి
అక్కడి పాటందుకోవడం చిత్రం
ఇక్కడి గాలిపీల్చి
సముద్రపు స్వరాలూదడం ఘోరం
ఆధిపత్యపు రోగాలు
అంత సులభంగా నయం కావు కానీ
ఇక్కడి నేల మీద పవళించి
మట్టి పరిమళపు తత్వం
తృణీకరించడం నేరం
భాషాతీతపు మట్టిబిడ్డలను
శతాబ్దాలుగా అక్కునజేర్చుకున్న
మమకారపు పంట పొలంలో
ఆధిపత్యపు కలుపు మొక్కలు
సరికొత్తగా మొనదేరుతున్నై
పదేండ్లకైనా పోతయో లేదో
అరశతాబ్దికి పైగా
పంటను పీడించి బలిసినై

కలుపు ఒక ఉసరవెల్లి
ఒడుపుగా పంట రంగులో

ఒదిగిపోతుంది
ఇప్పటి కలుపుమొక్కలు
అనేకానేక రూపాలెత్తుతై
పత్రికల అవతారంలో
సిగమూగుతై
ఇక్కడి నడకల్ని కీర్తిస్తూనే
కాళ్ళళ్ళ కనిపించని కట్టెలు బెడ్తై
భూమి పుత్రుల్ని కాటగల్పడానికి
గుంటనక్కల్లా ఎదురు చూస్తుంటై
వ్రతం చెడగొట్టడానికి
కోతిమూకలై యాగీ చేస్తుంటై
పంటచేల కంచెను
తుంటరి గాలులై
తూర్పార బడ్తుంటై
గుడిసె కొప్పు మీద
అగ్గిరవ్వలు విసరాలని చూస్తుంటై
కుట్రలు మొలుస్తుంటై
పన్నాగాలు అల్లుకుంటై
ఏదో వాదం రాజేసుకొని
తీరం మళ్లీ ఎదురెక్కాలని చూస్తుంది
ఏదో నినాదాన్ని ఆశ్రయించి
ఆధిపత్యానికి
రంగం సృష్టించుకొంటుంది

శాఖలన్నీ కలుపుతో
కలిసే ఉన్నై
కార్యాలయాలూ
విద్యాలయాలూ
పాలలో నీళ్ళలా
ఒదిగిపోయే ఉన్నై

మంచి చెడ్డలు విడమర్చేటప్పుడు
ఇక్కడ వాళ్ళ పీఠముందని
స్మరించుకోవాలె
వాళ్ళ రాతలు
చీకట్ల వంకర్లు దిద్దుకుంటున్న
సత్యం మనసున బెట్టుక తీరాలె
కడుపుల కత్తులు బెట్టుకొని
మాటలల్ల తేనెలొలక బోస్తరు
బోర్లా పడితే నవ్వుదామని
జరగని పనుల్లో
రంధ్రాలు వెతుకుతుంటరు
ఇది మూల మలుపు
రాష్ట్రమే బేకారని
కనిపించని ట్యాగ్‌లైన్ జోడిస్తరు
పారా హూషార్!
పదునుగా రాతల్ని
పరిశీలించాలె
పరిణతితో
కుట్రల్ని ఛేదించాలె

*(నమస్తే తెలంగాణ డైలీ, 4-1-2016)*

# చిగురుటాకు

చుట్టూరా
అదృశ్య శాసనాలు
తెగుతుంటాయి, బిగుస్తుంటాయి
మునిపంటి కింద వత్తిళ్ళు
చిట్లుతుంటాయి, అతుకుతుంటాయి
కనిపించని పరదాకింద
సౌందర్యం వికసిస్తుంది, ముకుళిస్తుంది
అనురాగ పాశాలు
తెగుతుంటాయి, ముడిపడుతుంటాయి
ఏవీ తనకు కొత్తవి కావు
మరీ ముఖ్యం
అమ్మకు దు:ఖం ఆమ్రేడితం

తొలి ఆటతోనే జత నుండి
విడదీయబడ్డ దీపస్థంభం
నిండుయవ్వనంలోనే అవసరార్థకాయంగా
నిలవేయబడ్డ ఏకాంత ద్వీపం
అయ్య వేలు పట్టుకొని
ఆయన వేలూ పట్టుకొని
కన్నయ్య ఛాయ పట్టుకొని
పరాధీన
పరాభావ దారుల్లో

లుప్తమైపోయిన చిగురుటాకు
ఎన్నిసార్లు వణికిపోతుందో
ఎవడి దగ్గరా లెక్కల్లేవు

చర్చకు రాకూడని జార విడుపు
నెలనెలా మోస్తూ
చిరునవ్వును పెదవులపై
అతికించుకు తిరగాలి
పదినెలలూ పరమయోగిలా
తపస్సు చేసి
జనన మరణాల వైతరణీ దాటి
ఎవరి వంశాకాశంలోనో
భానోదయం కలిగించాలి
గడియ గడియకూ మోగే
గడియారంలో గంటలా
ఇంటిలో అందరి చలనాలకు
తనే కంపించే అనునాదం కావాలె

రెండు నిండు కళ్ళుండీ
చంద్రమతి సూత్రమొకటే
ఆయనకు దృశ్యమానం
నేత్రద్వయాన్ని బంధించీ
కౌరవేయుని సకల జీవం
ఆమెకు స్పష్ట దృశ్యం

ఆమె దేవతకు పరరూపం
అతను దైత్యుడి హ్రస్వ పాపం

*దర్వాజ, నవతెలంగాణ, 14-5-2018*

# కవి గురించి

| | | |
|---|---|---|
| **పేరు** | : | ఏనుగు నరసింహారెడ్డి<br>కలానికి వేరే పేరేమీ లేదు |
| **పుట్టింది** | : | 06-04-1968న, యాదాద్రి, భువనగిరి జిల్లా<br>కల్లోనికుంట అనబడు మూసీ తీరం |
| పెరిగింది | : | నల్లగొండ రోడ్డెంట చిట్యాలలో |
| **అమ్మ నాయన** | : | ఏనుగు లక్ష్మమ్మ, కృష్ణారెడ్డి |
| **జత** | : | అరుణ |
| **వంతెనలు** | : | తేజస్విని, గీతాంజలి |
| **రాత** | : | సమాంతర స్వప్నం - 1995<br>నేనే - 2002<br>మట్టిపాట - 2008<br>కొత్తపలక - 2013<br>హైద్రాబాద్ విషాదం - 2016 |
| **నడుస్తున్నది** | : | తెలంగాణ రుబాయిలు 2016 నుండి<br>ఆంధ్రప్రభలో వారం వారం సీరియల్ |
| **కవి మీద పుస్తకం** | : | అరతెర తీసిన రంగస్థలం - గుడిపాటి,<br>గురిజాల రామశేషయ్య సంపాదకత్వంలో |
| **ఉంటుంది** | : | హైద్రాబాద్ |

**కితాబు**

1. తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కారం - 2014
2. బండ్ల సుబ్రహ్మణ్యం స్మారక బహుమతి - 1995
3. రంజని-కుందుర్తి ఉత్తమ కవితా పురస్కారం - 2016
4. నెలవంక నెమలీక వారి కలహంస పురస్కారం - 2013
5. వర్కింగ్ జర్నలిస్టు కవిత్వ బహుమతి
6. నవతెలంగాణ వట్టికోట ఆళ్వారుస్వామి ఉత్తమ కవితా పురస్కారం-2016
7. తెలంగాణ రాష్ట్రస్థాయి తేజ సాహితీ పురస్కారం - 2017
8. కళాంజలి విజ్ఞానపీఠం వారి గౌరవ పురస్కారం
9. జగిత్యాల బోయినపల్లి వెంకటరామారావు సాహిత్య పురస్కారం - 2016
10. అక్షరకళాభారతి వారి అక్షర సాహితీ పురస్కారం - 2018
11. రాజారాం ఫౌండేషన్ రాష్ట్రస్థాయి సాహితీ పురస్కారం - 2018





# Moola Malupu

An Anthology of Poetry

By Anugu Narasimha Reddy

లోకం

వచ్చిన దారి మర్చిపోతూ ఉంటుంది
మనుషులంతా మాల్స్‌లో
చిక్కుకుపోతూ ఉంటారు
అప్పుడప్పుడు
ప్రాచీలోకంలోకి తొంగి చూసి
వ్యత్యాసాల వేదనని తట్టుకోలేక
వర్తమానంలోకి దూకేస్తుంటారు
ఉక్కుకవచాల్ని ధరించామని భ్రమిస్తూ
మాయా వాయువుల్ని
మజా చేస్తుంటారు

మనం ఉన్నచోటే ఉండి
ఒకర్నొకరం తప్పిపోతూ ఉంటాం

PALAPITTA BOOKS